# సుస్థిరాభివృద్ధికి ఊతం ఇస్తున్న పర్వతాలు

("అంతర్జాతీయ పర్వత దినం" సందర్భంగా)

ప్రపంచ జీవ వైవిధ్యంలో 15 శాతం వరకు జీవ జనాభా పర్వతాలలో నివసించడం, ప్రజావినియోగానికి దాదాపు 50 శాతం తాగు నీటి(ఫ్రెష్ వాటర్) కేంద్రాలుగా పర్వతాల ప్రాధాన్యతలను గుర్తించిన ఐరాస 'సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు-2030'లో పర్వతాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం జరిగింది. వాతావరణ మార్పులు, పర్యావరణ కాలుష్యం, పర్వతాల దోపిడి లాంటి మానవ స్వార్థపూరిత కార్యాలతో పర్వతాల ఉనికిని ప్రమాదంలో నెట్టడం, పర్వతాలే నిరుపేద గిరిజన జాతుల గృహాలుగా సహకరిస్తున్నాయనే విషయాలను మరిచి పోవడం అత్యంత విచారకరం. పర్వతాల పతనం మానవాళినే కాకుండా, ప్రాణికోటి ఆరోగ్యకర జీవనాన్ని ప్రమాదంలోకి నెడుతోందని గమనించాలి. కార్బన్ ఉద్గారాలను తగ్గించుట, జీవవైవిధ్యాలకు నెలవులు, శుద్ధ జల కేంద్రాలుగా పర్వతాలు నిశ్శబ్ద విశిష్ట సేవలను అందిస్తున్నాయి.

పర్వతాల ప్రయోజనాలు:

పర్వతాల పరిరక్షణ అత్యంత ప్రధాన అంశమని భావించిన ఐక్యరాజ్యసమితి 2002 ఏడాదిని 'అంతర్జాతీయ పర్వత సంవత్సరం'గా ప్రకటించడంతో పాటు, ఐరాస సర్వసభ్య సమావేశ తీర్మానం ప్రకారం 2003 నుండి ప్రతి ఏట 11 డిసెంబరున 'అంతర్జాతీయ పర్వత దినం (ఇంటర్నేషనల్ మౌంట్స్ డే)' పాటించుట ఆనవాయితీగా మారింది

. 'వూమెన్ మూవ్ మౌంటేయిన్స్' అనబడే నినాదంతో నిర్వహిస్తున్న ప్రపంచ పర్వత దినం-2022 వేదికగా ప్రపంచ పర్యావరణ పరిరక్షణకు, మానవాళి హితానికి పర్వతాల చేస్తున్న మేలును అవగాహన చేయడం జరుగుతుంది. జీవనోపాధి, జీవవైవిధ్య పరిరక్షణ, సహజ ప్రకృతి అందాల వడ్డింపు, విలువైన ఉత్పత్తుల నెలవు, స్థానిక కళల ప్రోత్సాహం, గిరిజనుల ఉనికి లాంటి అంశాల్లో పర్వతాలు ప్రధాన భూమిక నిర్వహిస్తున్నాయి. ప్రపంచ పర్యాటకంలో 15-20 శాతం గ్లోబల్ టూరిజంను పర్వతాలు ఆకర్షిస్తున్నాయి. కోవిడ్-19 విజృంభనతో ప్రపంచ ఆర్థికం, ప్రజా సేవలు, జీవనోపాధుల లాంటి రంగాలతో పాటు పర్వత పర్యాటకరంగం కూడా ప్రభావితం కావడం చూశాం. పర్వత సహజ వనరులను మానవాళి సంక్షేమం, పర్యావరణ హరిత పరిరక్షణ, ఆదాయ వనరుల వినియోగానికి పర్వతాలు ఉపకరిస్తాయనే సంపూర్ణ అవగాహన కలిగించడం అవసరంగా భావించి పర్వత దినం నిర్వహిస్తున్నారు. ప్రపంచ జీవ వైవిధ్యానికి ప్రధాన కేంద్రాలు, జీవ వైవిధ్య ఆరోగ్యకర మనుగడ, దాదాపు 80 శాతం ముఖ్య ఆహార ఉత్పత్తుల (మె?క్క జొన్న, పొటాటో, బార్లీ, టమాట, ఆపిల్, సొర్గమ్ లాంటివి) కేంద్రాలు, శుద్ధ జలం ఊటలుగా అనేక ఉపయోగాలను పర్వాతాలు మానవాళికి కల్పిస్తున్నాయని తెలుసుకోవాలి.

## పర్వతాల పరిరక్షణ:

పర్వతాల పరిరక్షణ, పర్వత విస్తీర్ణలా అభివృద్ధి, పర్యాటకాన్ని ప్రోత్సహించడం లాంటి అంశాలకు అధిక ప్రాధాన్యతలను ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైంది. పర్వతాలను స్వార్థానికి విచ్ఛిన్నం చేయడం, పర్యాటకం పేరుతో పర్వతాల సహజ ఆకర్షణకు భంగం కలిగించడం, మానవ ఆరోగ్య పరిరక్షణ, పర్వత ఉత్పత్తుల కోసం అతిగా వాడుకోవడం లాంటి దుశ్చర్యలు మానవ ఉనికికే ప్రమాదకరంగా మారుతాయని మరువరాదు. పర్వతాల పరిరక్షణతో పేదరిక నిర్మూలన, జీవవైవిధ్య పరిరక్షణ, సహజ/సాంస్కృతిక/ఆధ్యాత్మిక కేంద్రాలు, విలువైన సంపదల తావులు, పర్యాటక అద్భుత దృశ్యాలు, సంప్రదాయ వేడుకలు వంటి మేలును మానవాళికి అందిస్తున్నాయి. అంతర్జాతీయ పర్వత దినం వేదికగా పర్వత ప్రయోజనాల ఆధారంగా విద్యాలయాల్లో పోటీల నిర్వహణ, పర్వత పర్యాటక ప్రయాణాల నిర్వహణ, ఫోటో ప్రదర్శనలు, పర్వతారోహణ క్రీడల నిర్వహణ, మోటారు/సైకిల్/నడకల నిర్వహణ, పర్వతాల పాత్రను వివరించే అవగాహనలు లాంటి అనేక కార్యక్రమాలను నిర్వహించవచ్చు. వాటర్ సైక్లింగ్ (జల చక్రం), వ్యవసాయం, సహజ ఉత్పత్తులు, సకల జీవుల రక్షణ, వాతావరణ సానుకూల మార్పులు, జీవవైవిధ్య పరిరక్షణ అందాల విందులు, పర్వత ఆధార పరిశ్రమలు, జల విద్యుత్తు జననం, కాలుష్యాలను తగ్గించడం, గిరిజనుల నివాస కేంద్రాలుగా పర్వతాలు మానవాళి ప్రగతిలో తమ వంతు కర్తవ్యాలను అడక్కుండానే నిర్వహిస్తున్నాయి. పర్వతాలు మానవాభివృద్ధికి రెక్కలని, ఆరోగ్య పరిరక్షణ ప్రదాతలని మరువరాదని, పర్వతాల అందాలను విచ్ఛిన్నం చేయరాదని తెలుసుకోవాలి.



- డా।। బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## ఢిల్లీలో బీజేపీ ఓటమి నైతిక భాధ్యత వహిస్తూ అధ్యక్షుడు ఆదేశ్ గుప్తా రాజీనామా

న్యూఢిల్లీ డిసెంబర్ 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఎంసీడీ ఎన్నికల్లో ఓటమి నేపథ్యంలో ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు ఆదేశ్ గుప్తా అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. పార్టీ అధ్యక్ష పదవికి ఆయన రాజీనామా చేశారు. ఆదేశ్ గుప్తా రాజీనామాకు బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ ఆమోదం తెలిపారని ఆ పార్టీ వర్గాలు వెల్లడించినట్టు రిపోర్టులు వెలువడుతున్నాయి.కాగా ఆదేశ్ గుప్తా రాజీనామా చేయడంతో ఢిల్లీ బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా విరేంద్ర సచ్‌దేవ్ వ్యవహరించనున్నారు. తదుపరి అధ్యక్షుడి నియామకం జరిగే వరకు ఆయనే బాధ్యతల్లో కొనసాగనున్నారని సమాచారం. ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఆప్ ఘన విజయం సాధించింది. ఎండీసీలో మొత్తం 250 వార్డులు ఉండగా.. ఆప్ 134 సీట్లు, బీజేపీ 104 గెలుచుకున్నాయి. 9 సీట్లు మాత్రమే గెలిచిన కాంగ్రెస్ మూడవ స్థానానికి పరిమితమైంది. ఇతరులు 3 స్థానాల్లో గెలుపొందారు.

## పేదలకు దుస్తులు వితరణ



ఖమ్మం, డిసెంబర్ 12 (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం నగరం స్థానిక శ్రీనివాసనగర్ లోని షిలోహు పెంతెకోస్తు చర్చిలో 200 మంది పేదలకు దుస్తులు వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక 17వ డివిజన్ కార్పోరేటర్ ధనాల రాధ, వారి కుమారుడు శ్రీకాంత్, చర్చీ పాస్టర్ సిరిగిరి ఇసాక్ లు పాల్గొని దుస్తులు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో వడ్డెల్లి నవీన్, కె రాంబాబు, దుబ్బాకుల శ్రీనివాసరావు, డి రవి, అరుణ, డి సుజాత, నగేష్, శ్రీకాంత్, భాగ్యమ్మ, దయసాగర్, కృపా సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన మంత్రి పువ్వాడ



ఖమ్మం, డిసెంబర్ 12 (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం నగరంలో పలు డివిజన్ లలో రూ.1.35 కోట్లతో నిర్మించనున్న పలు అభివృద్ధి నిర్మాణ పనులకు రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ శంకుస్థాపన చేశారు. 25వ డివిజన్ అజరయ్య నగర్ లో గల మున్సిపల్ కమ్యూనిటీ భవనం పై రూ. 45 లక్షలతో రెండవ అంతస్తు నిర్మాణం మరియు మొదటి అంతస్తు మరమ్మత్తు పనులకు శంకుస్థాపన చేశారు. 27వ డివిజన్ శ్రీనివాస్ నగర్ లో రూ.45 లక్షలు, 52వ బర్హన్ పురం రూ.45 లక్షలతో నిర్మించనున్న సైడ్ డ్రైన్స్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మొత్తం రూ.1.35 కోట్లతో నిర్మించనున్న అభివృద్ధి పనులకు మంత్రి పువ్వాడ శంకుస్థాపనలు చేశారు.

కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, సుడా చైర్మన్ విజయ్, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ ఏఎంసి చైర్మన్ లక్ష్మీ ప్రసన్న, సురభి, కార్పొరేటర్లు గోళ్ళ చంద్రకళ, బుర్రి వెంకటేశ్వర రావు, కర్నాటి కృష్ణ, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, మున్సిపల్ డిఈ లు, ఏఈ లు సిబ్బంది, డివిజన్ నాయకులు ఉన్నారు.

## నాగ్ పుర్ రైల్ వే స్టేషన్ నుండి వందే భారత్ ఎక్స్ ప్రెస్ కు ఆకుపచ్చటిజెండా ను చూపిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, డిసెంబర్ 12నాగ్ పుర్ మరియు బిలాస్ పుర్ ను కలిపే వందే భారత్ ఎక్స్ ప్రెస్ రైలు కు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు న నాగ్ పుర్ రైల్ వే స్టేశన్ లో ఆకుపచ్చటి జెండా ను చూపి, ఆ రైలు ను ప్రారంభించారు.

ప్రధాన మంత్రి వందే భారత్ ఎక్స్ ప్రెస్ యొక్క రైలు పెట్టెల ను పరిశీలించారు. ఆ రైలు పెట్టెల లో ప్రయానించేటప్పుడు లభించే సౌకర్యాలను ఆయన గమనించారు. వందే భారత్ ఎక్స్ ప్రెస్ యొక్క లోకోమోటివ్ ఇంజను యొక్క నియంత్రణ కేంద్రాన్ని శ్రీ నరేంద్ర మోదీ చూశారు. నాగ్ పుర్ మరియు అజ్ నీ రైల్ వే స్టేశన్ ల అభివృద్ధి ప్రణాళికల ను కూడా ఆయన పరిశీలించారు. ఈ రైలు తో నాగ్ పుర్ నుండి బిలాస్ పుర్ వరకు పట్టే ప్రయాణ కాలం 7-8 గంటల నుండి తగ్గిపోయి 5 గంటల 30 నిమిషాలు అయిపోతుంది.

## భూమి, భుక్తి, విముక్తి పోరాట ఉద్యమానికి దొడ్డి కొమరయ్య స్ఫూర్తి

### -రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు

ఆలేరు డిసెంబర్ 12 (ఎక్స్ ప్రెస్ నేవేస్ );తెలంగాణ సాయుధ పోరాటం భూమికోసం, భుక్తికోసం, విముక్తి పోరాట ఉద్యమంగా మారడానికి దొడ్డి కొమరయ్య అమరత్వమే ప్రధాన కారణమని, తెలంగాణ సాయుధ పోరాటం చరిత్ర అని తలుచుకోగానే మొదటగా స్ఫురణకు వచ్చే వ్యక్తి దొడ్డి కొమురయ్య అని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తితో నే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామన్నారు. ఆలేరు పట్టణంలో దొడ్డి కొమురయ్య కాంస్య విగ్రహాన్ని ఏపీకి చెందిన హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, టెస్కాబ్ వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి, తెలంగాణ కురుమ సంఘం అధ్యక్షుడు ఎడ్ల మల్లేశంతో కలిసి మంత్రి హరీశ్‌రావు ఆవిష్కరించారు.

అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గంలో ఎంతో స్ఫూర్తిని చూపిస్తూ దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. కురుమ కులస్తులైన రాములు సాంబశివుడు నమ్మిన ధర్మం కోసం చివరి వరకు పోరాటం చేశారని, ఏ కులంలో నైనా ఐక్యత, విద్య ఉండాలని మంత్రి అన్నారు. కురుమ కులస్తులు కూడా ఐక్యమత్యంగా ఉండి విద్యలో రాణించాలని తాను కోరుకుంటున్నా నన్నారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, కురుమ కులస్తులు పిల్లలను బాగా చదివించాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన గురుకుల పాఠశాలలో ఇంగ్లిష్ విద్యాబోధన అందిస్తున్నారని, ఎక్కడైనా చదివించవచ్చు కానీ చదివించడం మాత్రం ముఖ్యం అన్నారు.



బాల్య వివాహాల నిర్మూలించేందుకు కల్యాణ లక్ష్మి పథకం ఉపయోగపడుతుందని, 18 ఏండ్లు నిండిన వారికి మాత్రం కల్యాణ లక్ష్మి వర్తిస్తుందని, దాంతో సమాజంలో బాల్య వివాహాలు చాలా వరకు తగ్గాయన్నారు. దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తిని తెలంగాణ ప్రభుత్వం పాఠ్య పుస్తకాల్లో చేర్చిందని, కొమురవెల్లి మల్లన్న గుడికి ఒక కురుమను చైర్మన్ చేసిన ఘనత కూడా టీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. రాష్ట్ర కురుమ సంఘం భవనం పూర్తికావొచ్చిందని, త్వరలోనే దాన్ని పూర్తి చేసి కురుమ కులస్తులకు అందివనున్నట్లు తెలిపారు. విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం గొప్పతనం కాదని, స్ఫూర్తిని కొనసాగించినప్పుడే ఆయనకి నిజమైన నివాళి అర్పించినట్టు అవుతుందన్నారు.

## తెలంగాణా ప్రభుత్వం అన్ని కులాలు, మతాలను గౌరవిస్తుంది-మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



హైదరాబాద్ డిసెంబర్ 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తెలంగాణా ప్రభుత్వం అన్ని కులాలు, మతాలను గౌరవిస్తుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చెప్పారు. ఆదివారం వెస్ట్ మారేడ్ పల్లిలోని తన నివాసం వద్ద క్రిస్మస్ వేడుకల నిర్వహణ, ఏర్పాట్లపై క్రిస్టియన్ మతపెద్దలు, వివిధ చర్చిల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆదేశాల మేరకు అన్ని పండుగలను ఘనంగా జరుపుకొనే విధంగా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. అదేవిధంగా క్రిస్మస్ సందర్భంగా కూడా పేదలకు నూతన దుస్తుల పంపిణీ, ప్రభుత్వం ఆధ్వర్యంలో డిన్నర్ లను ఏర్పాటు చేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. ఈ సంవత్సరం కూడా క్రిస్మస్ సందర్భంగా ప్రభుత్వం అందించే గిఫ్ట్ ప్యాక్ లను ఈనెల 13 వ తేదీన పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. నియోజకవర్గ పరిధిలో 8 ప్రాంతాలలో డిన్నర్ నిర్వహణ కోసం ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు అవుతున్నాయని చెప్పారు. క్రిస్టియన్ ల ఆత్మగౌరవాన్ని మరింత పెంపొందించే క్రిస్టియన్ సంక్షేమ భవనం నిర్మాణ పనులకు ఈ నెల 12 వ తేదీన శంఖుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. భవన నిర్మాణం కోసం 2 ఎకరాల భూమి, 2 కోట్ల రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్పారు. ఈ సందర్భంగా క్రిస్టియన్ మత పెద్దలు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించి మంత్రికి ఆశీర్వచనం చేశారు. ఈ సమావేశ ంలో కార్పొరేటర్ లు హేమలత, మహేశ్వరి, మాజీ కార్పొరేటర్ లు నామన శేషుకుమారి, అత్తిలి అరుణ గౌడ్, ఉప్పల తరుణి, ఆఓఅ ముకుంద రెడ్డి, మోహన్ రెడ్డి, క్రిస్టియన్ ప్రతినిధులు ఆఆ ప్రశాంత్, దయాకర్, జయ రాజ్, సుదర్శన్ రావు, ఒఖీా డివిజన్ అధ్యక్షులు కొలన్ బాల్ రెడ్డి, రాజు, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, హన్మంతరావు, శ్రీనివాస్ గౌడ్, నాయకులు నాగులు, జయరాజ్, అశోక్ యాదవ్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## ఎఐఐఎమ్ఎస్నాగ్ పుర్‌ను దేశ ప్రజలకు అంకితం చేసిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, డిసెంబర్ 12ఎఐఐఎమ్ఎస్ నాగ్ పుర్ ను ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ దేశ ప్రజల కు ఈ రోజు న అంకితం చేశారు. నాగ్ పుర్ ఎఐఐఎమ్ఎస్ ప్రాజెక్టు నమూనా ను ప్రధాన మంత్రి కలియదిరుగుతూ పరిశీలించారు.

ఈ సందర్భం లో ఏర్పాటు చేసినటువంటి మైలురాళ్ల కు సంబంధించిన ఒక ప్రదర్శన గేలరీ ని కూడా ఆయన చూశారు.

దేశం అంతటా ఆరోగ్య సంబంధి మౌలిక సదుపాయాల ను సుదృఢం చేయాలి అనే ప్రధాన మంత్రి యొక్క వచనబద్ధత ఎఐఐఎమ్ఎస్ నాగ్ పుర్ ను దేశ ప్రజల కు అంకితం చేయడం ద్వారా మరింత గా సశక్తం కానున్నది. ఈ ఆసుపత్రి కి ప్రధాన మంత్రే 2017 జులై లో శంకుస్థాపన చేయగా, ఈ ఆసుపత్రి ని ప్రధాన్ మంత్రి స్వాస్థ్య సురక్ష యోజన అనే కేంద్రీయ రంగ పథకం లో భాగం గా ఏర్పాటు చేయడమైంది.

మొత్తం 1575 కోట్ల రూపాయల కు పైచిలుకు వ్యయం తో అభివృద్ధి పరుస్తున్నటువంటి ఎఐఐఎమ్ఎస్ నాగ్ పుర్ అత్యాధునిక సదుపాయాలు కలిగినటువంటి ఒక ఆసుపత్రి. దీనిలో ఒపిడి, ఐపిడి, రోగ నిర్ణయకారి సేవ లు, ఆపరేశన్ థియేటర్ లతో పాటు గా చికిత్స విజ్ఞానం తాలూకు అన్ని ప్రముఖ స్పెశియలిటీ మరియు సూపర్ స్పెశియలిటి విషయాలను కవర్ చేయడం జరిగింది.

ఈ ఆసుపత్రి మహారాష్ట్ర లోని విదర్భ ప్రాంతాని కి ఆరోగ్యం పరం గా ఆధునిక సౌకర్యాల ను అందిస్తుంది. దీనితో పాటు గా గఢ్ చిరౌలి, గోందియా, ఇంకా మేల ఘాట్ చుట్టుపక్కల గల ఆదివాసీ ప్రాంతాల కు ఒక వరదానం గా కూడా ను ఈ ఆసుపత్రి భాసిల్లుతుంది అని చెప్పాలి.

ప్రధాన మంత్రి వెంట మహారాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఏక్ నాథ్ శిందే, మహారాష్ట్ర గవర్నరు శ్రీ భగత్ సింహ్ కోశ్యారీ, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ దేవేంద్ర ఫడ్ ణవీస్ మరియు రహదారి రవాణా, ఇంకా రాజమార్గాల శాఖ కేంద్ర మంత్రి శ్రీ నితిన్ గడ్ కరీ లు ఉన్నారు.

## తిరుగులేని శక్తిగా బీఆర్ఎస్ : ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



మెదక్, డిసెంబర్ 12 నేటినిజం (ప్రతినిధి): ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో భారత రాష్ట్ర సమితి దేశవ్యాప్తంగా తిరుగులేని శక్తిగా మారబోతోందని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్ చెరు మండలం క్యాసారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఉప సర్పంచ్ భూపాల్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, అజీమ్, సుభాష్ రెడ్డి, ఎండీ చాంద్ తదితరులు ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారందరికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ అమలుపరిస్తున్న సంక్షేమ పథకాలు చేపడుతున్న అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై ప్రతిపక్షాల పార్టీల నాయకులు, కార్యకర్తలు భారత రాష్ట్ర సమితిలో చేరుతున్నారని తెలిపారు. అతి త్వరలో పటాన్ చెరు నియోజకవర్గం లోని ప్రత్యక్ష పార్టీల ముఖ్య నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరబోతున్నారని తెలిపారు. పార్టీ కార్యకర్తలను గుండెల్లో పెట్టుకుని చూసుకుని ఏకైక పార్టీ బీఆర్ఎస్ అన్నారు. ఈ కార్యక్రమంలో పటాన్ చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, క్యాసారం గ్రామ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రభాకర్, శరణప్ప, నర్సింలు, సత్యనారాయణ గౌడ్, సుధాకర్ రెడ్డి, రాజేశ్వర్ గౌడ్, శ్రీనివాస్ యాదవ్, నర్సింలు పాల్గొన్నారు.

## ఏపీలో బీఆర్ఎస్ ఎంట్రీ ఇస్తే ఎవరికి దెబ్బ పడుతుంది!

అమరావతి డిసెంబర్ 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఇంకా ఏపీలో అడుగు పెట్టని బీఆర్ఎన్ విషయంలో ఎవరికి వారు లెక్కలేసుకుంటున్నారు. రాజకీయ లాభాలను కూడా సరి చూసుకుంటున్నారు. ఇక బీఆర్ఎస్ ఏపీలో ఎంట్రీ ఇస్తే ఎవరికి దెబ్బ పడుతుంది అన్న చర్చ కూడా ముందుకు వస్తోంది. వీటికి జవాబు వైసీపీ సీనియర్ నేత ప్రభుత్వ సలహాదారు సజ్జల రామక్రిష్ణారెడ్డి ఇచ్చేశారు.ఏపీలో బీఆర్ఎస్ పోటీ చేయడం మంచిది అని ఆయన అనడం ఈ సందర్భంగా గమనార్హం. అదే టైం లో ఏపీలో బీయారెస్ తరఫున మద్దతుని కేసీయార్ కోరితే అపుడు తమ పార్టీ ఆలోచన చేస్తుంది అని సజ్జల చెప్పడం కూడా ఆసక్తిని గొలిపే విషయం. ఎందుకంటే బీయారెస్ ఏపీలో ఎంట్రీ ఇవ్వడం అంటూ జరిగితే దాని వల్ల వైసీపీకే మేలు అని ఒక వైపు చర్చ సాగుతూండగా దానికి ఊతమిచ్చేలా సజ్జల చేసిన ఈ కామెంట్స్ మరింతగా కొత్త చర్చకు ఆస్కారాన్ని ఇస్తున్నాయి.పైగా కేసీయార్ మద్దతు అడితే జగన్ ఆలోచించి నిర్ణయం తీసుకుంటారు అని సజ్జల చెబుతున్నారు తప్ప కాదు కుదరదు అని ఎక్కడా ఖండించకపోవడం విశేషం. పైగా ఏపీలో చూస్తే ఏ ఒక్క విపక్షంతో వైసీపీకి పొడ గిట్టే సీన్ లేదు. కానీ కేసీయార్ బీయారెస్ తో అలా కాదు కేసీయార్ జగన్ ల మధ్య ఉనన్ తెర వెనక దోస్తీ అందరికీ తెలిసిన బహిరంగ రహస్యం అంటారు. అయినా బీయారెస్ తో ఏపీలో వైసీపీ పొత్తు పెట్టుకుంటే అది రాజకీయంగా ఎవరికి ఎంత లాభం అన్నది కూడా చూడాల్సి ఉంటుంది అని అంటున్నారు.ఇక మరికొన్ని విషయాల్లో కూడా సజ్జల క్లారిటీ ఇచ్చారు. కర్నాటకలో తమ పార్టీ పోటీ చేస్తుందని ఈ మేరకు అక్కడ సీనియర్ నేత గాలి జనార్ధనరెడ్డితో చర్చలు కూడా పూర్తి అయ్యాయని అన్న దాని మీద ఆయన మాట్లాడారు. వైసీపీ పూర్తిగా ఏపీకే అంకితం అయిన పార్టీ అని ఆయన అన్నారు. ఏపీలో సంక్షేమం అభివృద్ధి తమకు కావాలని ఆయన చెపుకొచ్చారు. పొరుగు రాష్ట్రాల్లో పోటే అంటే ముందుగా తెలంగాణాలోనే పోటీ చేయవచ్చు కదా. అలాగే తమిళనాడులో కూడా పోటీకి దిగవచ్చు కదా అని ఆయన కొత్త పాయింట్ తీశారు.ఎవరో భుజాలు ఎక్కి వారితో పొత్తు పెట్టుకుని వారి మద్దతుతో పోటీ చేయడం కొన్ని సీట్లు తెచ్చుకోవడం అనంది వైసీపీకి ఇష్టం లేని వ్యవహారం అని సజ్జల అంటున్నారు. ఇతర పార్టీలతో పొత్తులు పెట్టుకుని అధికారంలోకి వచ్చే ఆలోచన ఏదీ తమకు లేదని సజ్జల చెబుతున్నారు. అంటే కేవలం ఏపీ తప్ప మరే చోట వచ్చే ఎన్నికల్లో వైసీపీ పోటీ చేయదు అని ఆయన చెప్పినట్లు అయింది. ఇక ఇదే సమయంలో ఆయన సమైక్యాంధ్రా గురించి కూడా మళ్లీ కామెంట్స్ చేశారు.ఉమ్మడి ఏపీ అలాగే ఉండాలని సమైక్యాంధ్రాకే ఓటేసిన పార్టీ తమదని ఆయన గుర్తు చేశారు. అదే టైంలో ఏపి రాష్ట్ర విభజన సరైన పద్ధతిలో జరగలేదు అని సజ్జల కీలక వ్యాఖ్యలు చేశారు. ఇంతకాలం ఇదే మాటను మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ చెబుతూ వచ్చారు. ఇపుడు ఇదే మాటను సజ్జల కూడా అంటున్నారు అంటే ఇది ఏమైనా ఎన్నికల వ్యూహంలో భాగమా అన్న చర్చ కూడా వస్తోంది



# ఆర్థికంగా వెనుక బడిన వారు కుడా బీసిలే: వాణి రెడ్డి



నల్లగొండ డిసెంబర్ 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );రాష్ట్రము లో ఆర్థికంగా వెనుక బడిన వారు కుడా బిసిలే నని, వారిని గుర్తించి ఈ వర్గాల వారికి కులాలకు అతీతంగా సహాయ సహకారాలు అందించాలని బిసి ఐఖ్యవేదిక ఇబిసి విభాగం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షురాలు వాణి రెడ్డి పిలుపు నిచ్చారు.ఆదివారం నల్లగొండ జిల్లా మర్రిగూడెం లో బిసి సంఘం నాయకుడు జగన్ కూతురు వివాహానికి హాజరైన సందర్భంగా ఆమె మీడియా తో మాట్లాడారు.నేడు రాష్ట్రము బిసి వర్గాలే కాకుండా ఉన్నత వర్గాల్లోకుడా నిరుపేదలు ఉన్నారని వారిని ఇబిసి లు గా గుర్తించి వారిని పట్టించుకోవలసిన అవసర ఎంతైనా ఉందన్నారు. బిసి లు, ఇబిసి లకోసం రాజ్యసభ సబ్యులు,బిసి సంక్షేమ సంఘం జాతీయ అద్యక్షులు ఆర్. కృష్ణయ్య చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. తాను ఒసి వర్గానికి చెందినప్పటికీ ఆర్. కృష్ణయ్య స్ఫూర్తి తో ఇబిసి వర్గాల అబ్యున్నతి కోసం కృషి చేస్తానన్నారు.ఈ సమావేశంలో మర్రిగూడెం సర్పంచ్ యాదగిరి రెడ్డి ,నల్లగొండ జిల్లాకు చెందిన బిసి నాయకులు పాల్గొన్నారు.

# ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా భారతదేశంలోని 197 జిల్లాల్లో నిర్వహించబడుతుంది

న్యూఢిల్లీ, డిసెంబర్ 12మేళాలో భాగంగా యువతకు అప్రెంటిస్‌షిప్ అవకాశాలను అందించడానికి అనేక స్థానిక వ్యాపారాలకు ఆహ్వానం

స్కిల్ ఇండియా మిషన్ కింద భారతదేశంలోని యువతకు కెరీర్ అవకాశాలను పెంపొందించాలన్న ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ మార్గనిర్దేశం మేరకు నైపుణ్యాభివృద్ధి మరియు వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ (ఎంఎస్‌డిఈ) డిసెంబర్ 12, 2022న దేశంలోని 25 రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాల్లోని 197 ప్రదేశాల్లో ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళాను (పిఎంఎన్ఏఎం) నిర్వహించనుంది.

స్థానిక యువతకు అప్రెంటిస్‌షిప్ శిక్షణ ద్వారా వారి కెరీర్‌ను రూపొందించుకునే అవకాశాన్ని అందించడానికి అనేక స్థానిక వ్యాపారాలు మేళాలో భాగం కావడానికి ఆహ్వానించబడ్డాయి. ఈ కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన కంపెనీలు పాల్గొననున్నాయి. పాల్గొనే కంపెనీలు ఒకే ప్లాట్‌ఫారమ్‌లో అప్రెంటీస్‌లను కలుసుకునే అవకాశాన్ని పొందుతాయి. మరియు అక్కడికక్కడే దరఖాస్తుదారులను ఎంపిక చేస్తాయి అలాగే వారి సంస్థలో భాగమయ్యే అవకాశాన్ని వారికి అందిస్తాయి.

ఆసక్తిగల అభ్యర్థులు https://www.apprenticeshipindia.gov.in/ ని సందర్శించడం ద్వారా మేళాకు నమోదు చేసుకోవచ్చు. అలాగే మేళా జరిగే సమీప ప్రదేశాన్ని తెలుసుకోవచ్చు. 5వ తరగతి నుండి 12వ తరగతి వరకు ఉత్తీర్ణులైన అభ్యర్థులు మరియు నైపుణ్య శిక్షణ సర్టిఫికేట్లు లేదా ఐటిఐ డిప్లొమా హోల్డర్లు లేదా గ్రాడ్యుయేట్లు ఈ అప్రెంటిస్‌షిప్ మేళాలో దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులు మూడు రెజ్యూమ్ కాపీలు, మార్క్‌షీట్లు, మూడు సర్టిఫికేట్‌ల కాపీలు, ఫోటో ఐడీ (ఆధార్ కార్డ్ / డ్రైవింగ్ లైసెన్స్ మొదలైనవి) మరియు మూడు పాస్‌పోర్ట్ సైజు ఫోటోగ్రాఫ్‌లను సంబంధిత వేదికలకు తీసుకెళ్లాలి.

ఇప్పటికే నమోదు చేసుకున్న వారు సంబంధిత పత్రాలతో వేదిక వద్దకు చేరుకోవాలని సూచించబడింది. ఈ ఫెయిర్ ద్వారా అభ్యర్థులు నేషనల్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సివిఈటి) గుర్తింపు పొందిన ధృవీకరణ పత్రాలను కూడా పొందుతారు. తద్వారా శిక్షణ తర్వాత వారి ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడతాయి.

ప్రధాన్ మంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళాపై నైపుణ్యాభివృద్ధి మరియు వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ అతుల్ కుమార్ తివారీ తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ "నేటి యువతకు అప్రెంటిస్‌షిప్ అవకాశాల పరంగా భారతదేశం తరచు ఇతర అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలతో పోల్చబడింది. ఈ అంతరాన్ని తగ్గించడానికి, శిక్షణార్థులు మరియు విద్యార్థులకు అప్రెంటిస్‌షిప్ అవకాశాలను అందుబాటులోకి తీసుకురావడానికి మేము మా వంతు ప్రయత్నం చేస్తున్నాము. గత నెలలో జరిగిన అప్రెంటిస్‌షిప్ మేళా సందర్భంగా కష్టపడి పనిచేయడానికి, మన ఆర్థిక వ్యవస్థకు సహకారం అందించడానికి మరియు మన దేశ భవిష్యత్తును రూపొందించడంలో సహాయం చేయడానికి ఆసక్తి ఉన్న యువత నుండి మాకు గొప్ప స్పందన లభించింది. ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యం ఏమిటంటే ఎక్కువ మంది అప్రెంటిస్‌లను నియమించుకునేలా కంపెనీలను ప్రోత్సహించడం. అదే సమయంలో సరైన ప్రతిభను కనుగొనడంలో మరియు శిక్షణ మరియు ఆచరణాత్మక అనుభవం ద్వారా వారి సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడంలో యజమానులకు సహాయం చేయడం. అప్రెంటిస్‌షిప్ నుండి ఉన్నత విద్య వరకు విశ్వసనీయమైన మార్గాలను నిర్మించడంతో పాటు విద్యావ్యవస్థలో అప్రెంటిస్‌షిప్‌ను పొందుపరచడం కూడా కీలకం. మా నిరంతర ప్రయత్నాలతో 2022 చివరి నాటికి భారతదేశంలో అప్రెంటిస్‌షిప్ అవకాశాలను 10 లక్షలకు మరియు 2026 నాటికి 60 లక్షలకు పెంచడమే లక్ష్యం" అని వెల్లడించారు.

దేశంలో ప్రతి నెలా అప్రెంటిస్‌షిప్ మేళాలు నిర్వహించబడతాయి. ఇందులో ఎంపిక చేసిన వ్యక్తులు కొత్త నైపుణ్యాలను పొందేందుకు ప్రభుత్వ ప్రమాణాలకు అనుగుణంగా నెలవారీ స్టైఫండ్‌ను అందుకుంటారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో అప్రెంటిస్‌షిప్ అత్యంత స్థిరమైన మోడల్‌గా పరిగణించబడుతుంది మరియు స్కిల్ ఇండియా మిషన్ కింద ఇది పెద్ద ప్రోత్సాహాన్ని పొందుతోంది.

అప్రెంటిస్‌షిప్ శిక్షణ ద్వారా సంవత్సరానికి 10 లక్షలమంది యువతకు శిక్షణ ఇవ్వడానికి ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ లక్ష్యాన్ని నెరవేర్చడానికి, సంస్థలు మరియు విద్యార్థుల భాగస్వామ్యాన్ని పెంచడానికి పిఎంఎన్ఏఎం ఒక వేదికగా ఉపయోగించబడుతోంది. భాగస్వామ్య సంస్థల్లో ఉన్న వివిధ అవకాశాలపై యువతకు అవగాహన కల్పిస్తోంది.

# పరిశుభ్రత పాటిద్దాం.. ఆరోగ్యంగా ఉందాం.. ఎమ్మెల్యే దాసరి

కరీంనగర్, డిసెంబర్ 12 పరిశుభ్రత పాటించడం ద్వారా పట్టణ ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటారని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈరోజు స్వచ్ఛ సర్వేక్షన్ 2022- 23లో భాగంగా పట్టణంలోని 13, 32వ వార్డుల్లో ఓపెన్ ప్లాట్లలోని ప్లాస్టిక్ కవర్లు ఏరివేత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దాసరి స్వయంగా ప్లాస్టిక్ కవర్లు ఏరివేశారు. అనంతరం మాట్లాడుతూ? పెద్దపల్లి పట్టణాన్ని స్వచ్ఛ పట్టణంగా మార్చడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకొని ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటారన్నారు.

ప్రతి వార్డులో ప్లాస్టిక్ ఏరివేయడంతోపాటు- చెత్తను కూడా తడి, పొడి చెత్తగా వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని కోరారు. ఇంటి చుట్టు పక్కల గల మురికి కాలువలో, రోడ్లపై చెత్త వేయరాదన్నారు. పట్టణ ప్రజలెవరూ ప్లాస్టిక్ కవర్లు, చెత్తను రోడ్లపై, మురికి కాలువలో వేయొద్దన్నారు. అన్ని వార్డుల్లో యువత వారంలో ఒకరోజు కలిసికట్టుగా వార్డు శుభ్రం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు పోతని పురుషోత్తం, పాగాల సోనీ శ్రీకాంత్, నాయకులు సమ్మయ్య, మధు, మనోజ్, మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్, టౌన్ ప్లానింగ్ అధికారి అభినవ్, స్వచ్ఛ సర్వేక్షన్ ఇన్‌చార్జి ఆరెపల్లి సురేందర్, సానిటరీ ఇన్స్పెక్టర్లు రామ్మోహన్ రెడ్డి, పులిపాక రాజు, మున్సిపల్, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కవిత్వం వాస్తవికతకు దర్పణం కావాలి -రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య



హైదరాబాద్ డిసెంబర్ 12(ఎక్స్ ప్రెస్ న్యూస్ );కవిత్వం వాస్తవికతకు దర్పణం కావాలని రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య అన్నారు. హైదరాబాద్ లోని విద్యానగర్లో ఆదివారం బీసీ భవన్ లో తెలంగాణ కవుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుతారపు వెంకట్ నారాయణ అధ్యక్షతన రాష్ట్రస్థాయి కవి సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్ కృష్ణయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని డాక్టర్ జనువాద రామస్వామి రచించిన ఋణాను బంధం పుస్తకావిష్కరణ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి విచ్చేసిన కవులను ఉద్దేశించి ప్రసంగిస్తూ తెలంగాణ కవుల సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న సాహిత్య కృషిని కొనియాడారు. జనువాద రామస్వామి సాహితీపరంగా విశిష్టతల్ని కలిగిన వ్యక్తి అన్నారు. కవులు తమ కవిత్వంలో మారుతున్న కాలానుగుణంగా రచనా నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు.

ప్రాచీన సాహిత్యం పద్య పరిమళాలతో కొనసాగితే ఆధునిక సాహిత్యం వచనంలో వివిధ ప్రక్రియల్లో నడుస్తుందన్నారు. సాహిత్యం సమాజ హితం కోసం పనిచేయాలన్నారు. సాహిత్య, సాంస్కృతిక రంగాలు కలిసి పనిచేస్తేనే కవులు, కళాకారులకు నిజమైన వికాస మన్నారు

ఈ కార్యక్రమంలో తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాళేశ్వరం శంకరం, తెలంగాణా కవుల సంఘ ప్రధాన కార్యదర్శి రఘువీర్ ప్రతాప్, సాహిత్య కార్యదర్శి అనుముల ప్రభాకరా చారి డి.దైవాదీనం ఆలూరు విల్సన్, పొన్నం రాజయ్య గౌడ్, ఎం నారాయణరెడ్డి, బి వెంకటరమణ, కొమ్ము వరలక్ష్మి, వీఆర్ వరలక్ష్మి, చెన్నకేశవరెడ్డి వివిధ జిల్లాల నుండి కవులు పాల్గొన్నారు.

# 800 మిలియన్లకు పైగా బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారులతో ప్రపంచంలోనే అతిపెద్ద 'కనెక్ట్' దేశంగా భారతదేశం - కేంద్ర సహాయ మంత్రి శ్రీ రాజీవ్ చంద్రశేఖర్

న్యూఢిల్లీ, డిసెంబర్ 12800 మిలియన్లకు పైగా బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారులతో ప్రపంచంలోనే అతిపెద్ద 'కనెక్ట్' దేశంగా భారతదేశం అవతరించిందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపక అభివృద్ధి శాఖ సహాయ మంత్రి శ్రీ రాజీవ్ చంద్రశేఖర్ అన్నారు. నిన్న జరిగిన ఇండియా ఇంటర్నెట్ గవర్నెన్స్ ఫోరమ్ 2022 ముగింపు సమావేశంలో శ్రీ రాజీవ్ చంద్రశేఖర్ ప్రసంగించారు. 'సాధికారత కలిగిన భారతదేశం అభివృద్ధికి సాంకేతిక వినియోగం' అనే అంశంపై సమావేశం జరిగింది. ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ కార్యదర్శి శ్రీ ఆల్కేష్ కుమార్ శర్మ,ఇతర ప్రముఖులు సమావేశానికి హాజరయ్యారు.

ముగింపు సమావేశంలో మాట్లాడిన శ్రీ చంద్రశేఖర్ దేశంలో 800 మిలియన్లకు పైగా బ్రాడ్‌బ్యాండ్ సౌకర్యం వినియోగిస్తున్నారని అన్నారు. 800 మిలియన్లకు పైగా బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారులతో ప్రపంచంలోనే అతిపెద్ద 'కనెక్ట్' దేశంగా భారతదేశం గుర్తింపు పొందిందని అన్నారు. 5జి మరియు భారత్ నెట్ అందిస్తున్న అతి పెద్ద గ్రామీణ బ్రాడ్‌బ్యాండ్ నెట్ వర్క్ ను 1.2 బిల్లియన్లకు పైగా ప్రజలు వినియోగిస్తున్నారని తెలిపారు. ప్రపంచ ఇంటర్నెట్ రంగంలో ఇంత పెద్ద సంఖ్యలో భారతదేశం మాత్రమే వినియోగదారులను కలిగి ఉందని మంత్రి వివరించారు. పరిస్థితికి అనుగుణంగా సాంకేతిక ఆవిష్కరణలు తీసుకువస్తున్నామని దీనికి అనుగుణంగా నియంత్రణ విధానాలను రూపొందిస్తున్నామని శ్రీ చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఈ గ్లోబల్ స్టాండర్డ్ సైబర్ లా వ్యవస్థ మూడవ దశలో సంబంధిత వర్గాలు పాల్గొంటాయని పేర్కొన్న మంత్రి దీనివల్ల భారతదేశ ఇంటర్నెట్ వ్యవస్థను మరింత బలోపేతం చేసి ఆర్థిక పురోభివృద్ధికి సహకరిస్తుందని అన్నారు.

ఆర్థిక వ్యవస్థ భారతదేశంలో అభివృద్ధి చెందిన విధంగా దక్షిణ దేశాలు తమ ఆర్థిక వ్యవస్థను డిజిటీ కరణ చేయలేక పోయాయని శ్రీ చంద్రశేఖర్ అన్నారు. ఈ రంగంలో ప్రపంచ దేశాలకు అవసరమైన సహకారం, సాంకేతిక అంశాలను అందించడానికి భారతదేశం సిద్ధంగా ఉందని మంత్రి తెలిపారు. గుర్తింపు ప్రమాణీకరణ అంశంలో భారతదేశం అత్యంత శక్తివంతమైన దేశంగా అవతరించిందని అన్నారు. తమ ఆర్థిక వ్యవస్థలను డిజిటల్ ఆర్థిక వ్యవస్థలుగా అభివృద్ధి చేయాలని భావిస్తున్న అన్ని దేశాలకు భారతదేశం సహకరిస్తుందని జీ20 అధ్యక్ష హోదాలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రకటించిన అంశాన్ని మంత్రి గుర్తు చేశారు. భారతదేశ తరహాలో పరిపాలన సాగించాలని భావిస్తున్న అన్ని దేశాలకు భారతదేశం అండగా ఉంటుందని అన్నారు. అనేక ప్రయత్నాలు జరిగిన తర్వాత భారతదేశం తన ఇంటర్నెట్ వ్యవస్థకు బహుముఖ రూప వ్యవస్థగా అభివృద్ధి చేయడంలో విజయం సాధించిందని మంత్రి పేర్కొన్నారు. రానున్న సంవత్సరాల్లో బహుముఖ రూప వ్యవస్థ కేవలం మేధావుల చర్చకు పరిమితం కాకుండా మరింత వృద్ధి సాధించాలని ఆయన ఆకాంక్షించారు. దేశంలో ఇంటర్నెట్ వినియోగం మరింత పెరగాలని అన్నారు. సురక్షిత, నమ్మదగిన వినూత్న ఆవిష్కరణలు, జవాబుదారీతనం వృద్ధికి దోహదపడతాయని అన్నారు. డిజిటల్ విధానాలు నమ్ముతున్న ప్రజలకు వ్యవస్థకు జవాబుదారీగా ఉండాలని మంత్రి అన్నారు.

డిజిటల్ అక్షరాస్యతలో భారతదేశం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ కార్యదర్శి శ్రీ ఆల్కేష్ కుమార్ శర్మ అన్నారు. డిజిటల్ రంగంలో అవసరమైన నైపుణ్య అభివృద్ధికి డిజిటల్ ఇండియా మిషన్ కృషి చేస్తుందని అన్నారు. స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో సాధించిన అభివృద్ధితో నవ భారతదేశ నిర్మాణం జరుగుతుందని అన్నారు. ఇంటర్నెట్ సౌకర్యం లేని ప్రతి ఒక్కరికి కనెక్షన్ ఇవ్వడానికి ప్రయత్నాలు జరుగుతున్న నేపథ్యంలో 'సాధికారత కలిగిన భారతదేశం అభివృద్ధికి సాంకేతిక వినియోగం' అనే అంశంపై ఇండియా ఇంటర్నెట్ గవర్నెన్స్ ఫోరమ్ 2022 జరిగిందని అన్నారు. దీనివల్ల లక్ష్య సాధన దిశలో భారతదేశం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని శ్రీ ఆల్కేష్ కుమార్ శర్మ అన్నారు. గోప్యత, రక్షణ, డేటా, భద్రత, సంరక్షణ అంశాలపై పదునైన చట్టాలు రూపొందించాలని నిర్ణయించామని ఆయన అన్నారు. రాబోయే మూడేళ్లలో ట్రిలియన్ డాలర్ల డిజిటల్ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిపై దృష్టి సారించి పని చేస్తున్నామని ఆయన తెలిపారు.

ఐక్యరాజ్య సమితి ఇంటర్నెట్ గవర్నెన్స్ ఫోరమ్ కి అనుబంధంగా ఇండియా ఇంటర్నెట్ గవర్నెన్స్ ఫోరమ్ పనిచేస్తోంది. ఇంటర్నెట్ రంగంతో సంబంధం కలిగిన వివిధ వర్గాలను ఒక వేదిక పైకి తీసుకు రావడానికి ఇంటర్నెట్ గవర్నెన్స్ ఫోరమ్ కృషి చేస్తోంది. వివిధ వర్గాలకు చెందిన ప్రతినిధులను ఒక వేదిక పైకి తెచ్చి ఇంటర్నెట్ సంబంధిత విధాన నిర్ణయాలు తీసుకోవడానికి ఇంటర్నెట్ గవర్నెన్స్ ఫోరమ్ సహకారం అందిస్తోంది.

# 'నాగ్‌పుర్ మెట్రో ఫేజ్-2' కు శంకుస్థాపన చేసిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, డిసెంబర్ 12'నాగ్ పుర్ మెట్రో ఒకటో దశ' ను దేశ ప్రజల కు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు న అంకితం చేశారు. దీనితో పాటు గా ఖాప్ రీ మెట్రో స్టేశన్ లో 'నాగ్ పుర్ మెట్రో రెండో దశ' కు శంకుస్థాపన కూడా చేశారు.

ప్రధాన మంత్రి ఖాప్ రీ నుండి ఆటోమోటివ్ స్క్వేర్ వరకు, ఇంకా ప్రజాపతి నగర్ నుండి లోక్ మాన్య నగర్ వరకు మొదటి సారి గా రాక పోకల ను జరిపిన రెండు మెట్రో రైళ్ళ కు ప్రారంభ సూచకం గా ఆకుపచ్చటి జెండా ను చూపెట్టారు. నాగ్ పుర్ మెట్రో లో భాగం గా ఒకటో దశ ను 8650 కోట్ల రూపాయల కు పైచిలుకు వ్యయం తో అభివృద్ధి పరచడం జరిగింది. ఇక రెండో దశ ను 6700 కోట్ల రూపాయల కు పైగా వ్యయం తో అభివృద్ధి పరచడం జరుగుతుంది.

ప్రధాన మంత్రి ఫ్రీడమ్ పార్క్ మెట్రో స్టేశన్ నుండి నాగ్ పుర్ మెట్రో లో ప్రయాణించి, ఖాప్ రీ మెట్రో స్టేశను కు చేరుకొన్నారు. ఫ్రీడమ్ పార్క్ మెట్రో స్టేశన్ లో మెట్రో రైలు ను ప్రయాణించడానికి పూర్వం ప్రధాన మంత్రి నాగ్ పుర్ మెట్రో రైల్ ప్రాజెక్టు ను పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసినటువంటి 'సప్ నోం సే బెహ్ తర్' ప్రదర్శన ను కూడా ఆయన చూశారు.

ప్రధాన మంత్రి ఎఎఫ్ సి గేటు దగ్గర తన కోసం ఒక ఇ-టికెటు ను కొనుగోలు చేశారు. విద్యార్థుల తో, పౌరుల తో మరియు అధికారుల తో కలసి రైలు లో ఆయన ప్రయాణించారు. యాత్ర మధ్య లో వారి తో మాట్లాడారు.

"నాగ్ పుర్ మెట్రో యొక్క ఒకటో దశ ప్రారంభం సందర్భం లో నాగ్ పుర్ ప్రజల కు నేను అభినందనల ను తెలియజేయదలచాను. రెండు మెట్రో రైళ్ళ కు నేను పచ్చజెండా ను చూపెట్టడం తో పాటు మెట్రో లో ప్రయాణించాను కూడా. ఈ మెట్రో రైలు హాయి గాను, అనుకూలం గాను ఉంది." అని పేర్కొన్నారు.

''నాగ్ పుర్ మెట్రో లో ప్రయాణించినప్పుడు, ప్రధాన మంత్రి విద్యార్థుల తో, స్టార్ట్-అప్ రంగానికి చెందిన వారితో మరియు జీవనం లో ఇతర రంగాల కు చెందిన పౌరుల తో మాట్లాడారు." అని తెలిపింది.

ప్రధాన మంత్రి మెట్రో రైలు లో ఖావ్ రీ మెట్రో స్టేశన్ కు చేరుకొన్నప్పుడు ఆయన వెంట మహారాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఏక్ నాథ్ శిందే, మహారాష్ట్ర గవర్నరు శ్రీ భగత్ సింహ్ కోశ్యారీ, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ దేవేంద్ర ఫడ్‌ణవీస్ లతో పాటు రహదారి రవాణా మరియు రాజమార్గాల శాఖ కేంద్ర మంత్రి శ్రీ నితిన్ గడ్ కరీ కూడా ఉన్నారు.

వట్టణ ప్రాంతాల కు సంబంధించిన రాకపోకల క్రాంతి ని తీసుకు వచ్చేటటువంటి ముందడుగు గా అన్నట్టు, ప్రధాన మంత్రి 'నాగ్ పుర్ మెట్రో ఫేజ్-1' ని దేశ ప్రజల కు అంకితం చేయడం తో పాటు గా ఖాప్ రీ మెట్రో స్టేశను లో రెండు మెట్రో రైళ్ళ కు ఆకుపచ్చ జెండా ను చూపించి వాటిని బయలుదేరదీశారు. ఆ రెండు రైళ్ల లో ఒకటి ఆరెంజ్ లైన్ లో ఖాప్ రీ నుండి ఆటోమోటివ్ స్క్వేర్ వరకు, ఇంకొకటి ఆక్వా లైన్ లో ప్రజాపతి నగర్ నుండి లోక్ మాన్య నగర్ వరకు రాకపోక లను జరుపుతాయి. నాగ్ పుర్ మెట్రో లో భాగం అయిన ఒకటో దశ ను మొత్తం 8,650 కోట్ల రూపాయల కు పైగా వ్యయం తో అభివృద్ధి చేయడమైంది. ప్రధాన మంత్రి నాగ్ పుర్ మెట్రో యొక్క రెండో దశ కు శంకుస్థాపన ను కూడా చేశారు. రెండో దశ ను 6,700 కోట్ల రూపాయల కు పైగా ఖర్చు తో అభివృద్ధి పరచడం జరుగుతుంది.

# దళితుల జీవితాల్లో వెలుగులు : పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి




కరీంనగర్, డిసెంబర్ 12:దళిత బంధు పథకంతో దళితుల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం మడిపల్లి గ్రామానికి చెందిన కల్లెపల్లి శ్రీనివాస్ కి దళిత బంధు ద్వారా మంజూరైన కార్ ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా దళితుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ దళిత బంధు పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి, సర్పంచ్ రాణి-మోహన్, ఎంపీటీసీ పెండ్లి సంపత్,బీ ఆర్ ఎస్ ప్రజా ప్రతినిధులు వెన్నంపల్లి సర్పంచ్ కాసం శ్రీనివాస్ రెడ్డి,తూడి మల్లేష్, లక్ష్మీ నారాయణ, వార్డ శ్రీధర్,ఎల్లస్వామి, కూకట్ల నవీన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నూతన వధూవరులకు పొంగులేటి ఆశీర్వాదం



మహబూబాబాద్ డిసెంబర్ 12 (నేటినిజం ప్రతినిధి) :తక్కెళ్లపల్లి రవీందర్ ద్వితీయ కుమారుడి వివాహం ఇటీవల జరగ్గా నూతన వధూవరులను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, ఖమ్మం మాజీ పార్లమెంటు సభ్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి మహబూబాబాద్ జిల్లాలోని వారి స్వగ్రామంలో సోమవారం ఆశీర్వాదించారు. నిండునూరేళ్లు చల్లగా ఉండాలని దీవించారు. పొంగులేటి వెంట బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకల నరేష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# మంత్రిని కలిసిన టీయుడబ్ల్యూజే జర్నలిస్టుల బృందం

**- 18న జరిగే ఉమ్మడి జిల్లాల మహాసభలకు ఆహ్వానం**

**- సానుకూలంగా స్పందించిన మంత్రి పువ్వాడ అజయ్ కుమార్**



ఖమ్మం, డిసెంబర్ 12 (నేటినిజం ప్రతినిధి): టియుడబ్ల్యూజే (టీజేఎఫ్) జిల్లా మూడవ మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ ఆధ్వర్యంలో జర్నలిస్టుల ప్రతినిధుల బృందం మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ను ఆహ్వానించారు.

ఈనెల 18న ఖమ్మం సమీపంలోని ఎస్ఆర్ గార్డెన్ లో ఉదయం 10:30 గంటలకు జరిగే ఉమ్మడి ఖమ్మం జిల్లాల మహాసభలకు ఆహ్వానించగా.. మంత్రి సానుకూలంగా స్పందించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాల నుండి పెద్దఎత్తున 10 నియోజకవర్గాల నుండి వేలాదిగా జర్నలిస్టులు తరలివస్తున్నారని, కనీవిని ఎరుగని రీతిలో సభలు నిర్వహిస్తున్నామని మంత్రికి జర్నలిస్టుల ప్రతినిధుల బృందం వివరించారు.

ఈ కార్యక్రమానికి రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సాగర్, యూనియన్ ముఖ్య నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సభలను విజయవంతం చేసేందుకు జర్నలిస్టులు సకాలంలో తరలి రావాలని జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ పిలుపునిచ్చారు.

మంత్రిని కలిసిన వారిలో టియుడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షులు వెన్నెబోయిన సాంబశివరావు, చిర్రా రవి, ప్రశాంత్ రెడ్డి, రామకృష్ణ, ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు గుద్దేటి రమేష్ బాబు, షేక్ జానీ పాషా, కోశాధికారి కొరకొప్పుల రాంబాబు, నగర అధ్యక్షులు బాలబత్తుల రాఘవ, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష కార్యదర్శులు యలమందల జగదీష్, కరీష అశోక్, రాజు, శ్రీధర్ లు ఉన్నారు.

# గోవాలో స్వాహిద్ దివసను పాటించిన శ్రీ సర్బానంద సోనోవాల్

న్యూఢిల్లీ, డిసెంబర్ 12అస్సాం తొలి అమరవీరుడు ఖర్గేశ్వర్ తాలూక్దార్ 1979లో బలిదానం చేసుకున్న స్వాహిద్ దివస్‌ను పురస్కరించుకుని ఈ రోజు గోవాలో జరిగిన ఉద్వేగభరితమైన కార్యక్రమంలో కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్ ఉ జలమార్గాలు మరియు ఆయుష్ మంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్ చారిత్రాత్మక అస్సాం ఉద్యమంలో అమరవీరులకు నివాళులర్పించారు.

కేంద్ర మంత్రి మూడు రోజుల పాటు గోవాలో పర్యటించనున్నారు. పంజిమ్‌లోని ఫ్రాన్సిస్కో లూయిస్ గోమ్స్ గార్డెన్‌లో జరిగిన ఈ కార్యక్రమాన్ని అస్సాం సొసైటీ ఆఫ్ గోవా నిర్వహించింది. కార్యక్రమంలో అస్సామీ కమ్యూనిటీ సభ్యులు మరియు పలువురు ప్రముఖులు, స్థానికులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 1979-1985 వరకు ఆరేళ్లపాటు జరిగిన అసోం ఉద్యమంలో అమరులైన వారి పరాక్రమాన్ని స్మరించుకున్నారు. "ఈ రోజు స్వాహిద్ దివస్ సందర్భంగా అస్సాంను రక్షించడానికి అంతిమ త్యాగం చేసిన వారందరికీ నేను నమస్కరిస్తున్నాను. అక్రమ వలసదారుల నుండి రాష్ట్రాన్ని రక్షించడానికి అస్సాం ప్రజలు ఆరు సంవత్సరాల పాటు సాగిన ఉద్యమంలో పాల్గొన్నారు. భారతదేశ ఐక్యత మరియు సమగ్రతను కాపాడటానికి 860 మంది అమరవీరులు ప్రాణ త్యాగం చేశారు. ఈ గొప్ప అమరవీరులు తమ అసమానమైన దేశభక్తి మరియు ధైర్యంతో మరపురాని చరిత్రను వ్రాసారు. అస్సాం ఉద్యమం దేశాన్ని రక్షించడానికి అస్సాంలోని స్థానిక ప్రజల ఐక్య ప్రయత్నాలకు ఒక ప్రకాశవంతమైన ఉదాహరణ మరియు దాని ప్రభావం చాలా వరకు ఉంది. అమరవీరుల త్యాగం గొప్ప అస్సామీ సమాజానికి మరియు దేశానికి ఎప్పటికీ స్ఫూర్తినిస్తుంది '' అని మంత్రి పేర్కొన్నారు.

"అమరవీరుల గొప్ప ఆశయాలను సజీవంగా ఉంచడానికి మనం నిజాయితీ, అంకితభావం మరియు సంకల్పంతో పని చేస్తూనే ఉండాలి. మన భాష, సంస్కృతి, వారసత్వం మరియు సంప్రదాయాలను సజీవంగా ఉంచడానికి మన జాతీయ బాధ్యతను నిర్వర్తించాలి.




# రీసెర్చ్ ఎజెండా, సామాజిక అవసరాలు ఓపెన్ సైన్స్ పై అంతర్జాతీయ వర్క్ షాప్

న్యూఢిల్లీ, డిసెంబర్ 12సిఎస్ఐఆర్-ఎన్ఐఎస్ సిపిఆర్ (నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ కమ్యూనికేషన్ అండ్ పాలసీ రీసెర్చ్) సిఎస్ఐఆర్ టెక్నాలజీల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధిని సృష్టించడం , నైపుణ్య అభివృద్ధిని ప్రోత్సహించడంలో నిమగ్నమైంది. ల్యాబ్‌లోని వివిధ ఆర్ అండ్ డీ విభాగాల ద్వారా ఇటీవలి అత్యాధునిక క్షేత్రాలు పని చేస్తున్నాయి.

సైంటోమెట్రిక్ ఇన్‌స్టిట్యూట్ యొక్క బలమైన ప్రాంతాలలో ఒకటి మరియు ఊఎఖీ-ఔమిoఆూ (ఇది ఊఎఖీ-ఔమిoఅoఎఖీతో కలిసి ఔమిoఇఖీగా మారిన ప్రయోగశాలలో ఒకటి) ఈ ప్రాంతాన్ని భారతదేశంలో పరిశోధన మరియు ఇన్‌పుట్‌లో కేంద్రీకరించే ప్రాంతంగా తీసుకురావడంలో కీలకపాత్ర పోషించింది. .సంస్థ బలమైన ప్రాంతాలలో సియంటోమెట్రిక్ ఒకటి. సిఎస్ఐఆర్-ఎన్ఐఎస్ టిఏడిఎస్ (ఇది సిఎస్ఐఆర్-ఎన్ఐఎస్ సి ఎ ఐ ఆర్ తో విలీనమై ఎన్ ఐ ఎస్ సి పి ఆర్ గా మారిన ప్రయోగశాలలలో ఒకటి) ఈ ప్రాంతాన్ని భారతదేశంలో విధాన రూపకల్పనలో పరిశోధన , ఇన్పుట్ కేంద్ర స్థానంగా తీసుకురావడంలో కీలక పాత్ర పోషించింది. సీఎస్ఐఆర్-ఎన్ ఐ ఎస్ సి పి ఆర్ నిర్వహించిన 'రీసెర్చ్ ఎజెండా, సామాజిక అవసరాలు , ఓపెన్ సైన్స్' అనే అంశంపై నిర్వహించిన అంతర్జాతీయ వర్క్ షాప్ లో స్వాగతోపన్యాసం చేస్తూ, సీఎస్ఐఆర్-ఎన్ ఐ ఎస్ సి పి ఆర్ డైరెక్టర్ ప్రొఫెసర్ రంజనా అగర్వాల్ ఈ విషయం చెప్పారు.

వర్క్ షాప్ లో మాట్లాడుతున్న వర్క్ షాప్ లో మాట్లాడుతున్న సీ ఎస్ ఐఆర్-ఎన్ ఐ ఎస్ సీపీఆర్ డైరెక్టర్ ప్రొఫెసర్ రంజనా అగర్వాల్

సీ ఎస్ ఐఆర్-ఎన్ ఐ ఎస్ సీపీఆర్ దేశంలోని అతిపెద్ద ప్రభుత్వ సంస్థ అని, సైన్స్ , సమాజం మధ్య అంతరాన్ని తగ్గించడానికి పాపులర్ సైన్స్ మ్యాగజైన్ల ప్రచురణలతో పాటు ప్రచురించడానికి ఎపిసి ప్రమేయం లేనందున

ఇది వివిధ పరిశోధనా రంగాలలో 15 కి పైగా జర్నల్స్ ను ఓపెన్ యాక్సెస్ మోడ్ లో ప్రచురిస్తోందని ప్రొఫెసర్ అగర్వాల్ తెలిపారు. సీ ఎస్ ఐఆర్-ఎన్ ఐ ఎస్ సీపీఆర్ ఆన్ లైన్ రిపోజిటరీ నేషనల్ ఓపెన్ పీరియాడికల్స్ రిపోజిటరీ (ఎన్ఓపిఆర్) కూడా ప్రపంచంలోని ఎక్కడి నుండైనా పాత పేపర్లను యాక్సెస్ చేసుకోవడానికి వీలు కల్పిస్తుంది. ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్తు' అనే నినాదంతో సమస్యలను పరిష్కరించేందుకు సీ ఎస్ ఐఆర్-ఎన్ ఐ ఎస్ సీపీఆర్ కృషి చేస్తోందని ఆమె చెప్పారు.

సామాజిక సమస్యలపై మరింత దృష్టి కేంద్రీకరించడానికి శాస్త్రీయ పరిశోధనలు తమ ఎజెండాను మరింతగా మార్చుకోవాలని ప్రపంచ సవాళు పిలుపునిచ్చాయి. వివిధ దేశాల ఎస్ టి ఐ (సైన్స్-టెక్నాలజీ-ఇన్నోవేషన్) విధాన రూపకల్పన , ఆర్థిక సహాయ సంస్థలలో పునర్నిర్మాణం ప్రముఖంగా చూడవచ్చు. బాధ్యతాయుతమైన పరిశోధన , ఆవిష్కరణ, ఓపెన్ సైన్స్, ఓపెన్ ఇన్నోవేషన్స్ అనేవి వివిధ దేశాల విధాన వ్యక్తీకరణలలో స్థానం పొందే కొత్త శకం కొన్ని కీలక పదాలు. అపరిష్కృతమైన సామాజిక సవాళ్లను పరిష్కరించడానికి జోక్యం చేసుకుంటున్నందున ఇన్నోవేషన్ సిస్టమ్ అనధికారిక, అట్టడుగు , పొదుపు ఆవిష్కరణలపై కూడా తీవ్రమైన శ్రద్ధ చూపుతోంది. ఈ వాతావరణంలో విభిన్న వాటాదారుల మధ్య క్రాస్-డిసిప్లినరీ ఇంటరాక్షన్ లు ముఖ్యమైనవిగా మారాయి. ఎజెండాను పునర్నిర్మించడానికి , అమలు కోసం మార్గాలను రూపొందించడానికి విధాన పరస్పర చర్యలు మరింత సాక్ష్యంగా ఉండాలి. ఈ నేపథ్యంలోనే 2022 డిసెంబర్ 8వ తేదీన సీఎస్ఐఆర్ -ఎన్ఐఎస్ సీపీఆర్ లో రీసెర్చ్ ఎజెండా, సామాజిక అవసరాలు, ఓపెన్ సైన్స్ పై అంతర్జాతీయ కార్యక్రమం నిర్వహించ డం జరిగింది. ఈ సదస్సులో భారతదేశం తో పాటు విదేశాలకు చెందిన ప్రముఖ మేధావులు, విధాన రూపకర్తలు ప్రసంగించారు.

డాక్టర్ ఇస్మాయిల్ రఫోల్స్, యునెస్కో ఛైర్, లైడెన్ విశ్వవిద్యాలయం, నెదర్లాండ్స్ ప్రధానోపన్యాసం చేశారు.

బయోటెక్నాలజీ విభాగం సీనియర్ సలహాదారు డాక్టర్ సంజయ్ కుమార్ మిశ్రా, బిబ్లియోమెట్రిక్స్ , సైంటోమెట్రిక్స్ , ఇన్ఫోమెట్రిక్స్ అనే మూడు విజ్ఞాన మహాసముద్రాలను ఒకే మార్గంలో ఉంచుతూ వర్క్‌షాప్ సబ్జెక్ట్ గురించి

ప్రారంభోపన్యాసం చేశారు. మానవాళికి శాస్త్రీయ పరిశోధన నుండి గరిష్ట ప్రయోజనాన్ని పొందడానికి పరిశోధన, పరిశోధన ఎజెండాలో సమాజాలు, దేశాలు, ప్రపంచ స్థాయిలో సామాజిక అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని డాక్టర్ మిశ్రా కోరారు. రీసెర్చ్ అవుట్ పుట్ ఎంత ముఖ్యమో సైన్స్ అడ్వైజరీ పాత్ర కూడా అంతే ముఖ్యమని ఆయన అభిప్రాయపడ్డారు. సాధారణంగా సైన్స్ పరిశోధన పట్టణ అనుకూలమైనది, సంపన్నమైనది, సమాజ ఆధారిత , సైన్స్ సమాజం సమకాలీకరణపై కొత్త దృష్టి అవసరం. రీసెర్చ్ అవుట్‌పుట్ ఎంత ముఖ్యమో సైన్స్ అడ్వైజరీ పాత్ర కూడా అంతే ముఖ్యమైనదని ఆయన అభిప్రాయపడ్డారు. సాధారణంగా సైన్స్ పరిశోధన పట్టణ ప్రాంతాలకు, సంపన్నులకు అనుకూలమైనదని, అందుచేత సమాజంపై దృష్టిసారించడానికి సైన్స్ - సమాజం సమకాలీకరణ అవసరం అని అన్నారు.

సమాజం కోసం సైన్స్ పరిశోధనలో అంతరాన్ని అర్థం చేసుకోవడానికి బిబ్లియోమెట్రిక్స్ అండ్ సైంట్రోమెట్రిక్స్ సాధనాన్ని ఉపయోగించవచ్చు.

రెండవ సెషన్ లో వక్తలు 'పొదుపు ఆవిష్కరణలు , ఓపెన్ నెస్' పై దృష్టి పెట్టారు. సీఎస్ఐఆర్ -ఎన్ఐఎస్ సీపీఆర్ చీఫ్ సైంటిస్ట్ , పాలసీ రీసెర్చ్విభాగండీన్, వర్క్ షాప్ కో ఆర్డినేటర్ డాక్టర్ సుజిత్ భట్టాచార్య ఎస్టీఎస్ (సైన్స్,టెక్నాలజీ,సొసైటీ ) గురించి సంక్షిప్త వివరణ ద్వారా తన ప్రసంగాన్ని ప్రారంభించారు. టెక్నాలజీ అండ్ సొసైటీ, ఇన్నోవేషన్ స్టడీస్ , సైంటోమెట్రిక్స్ రీసెర్చ్, ఈ పరిశోధనా రంగాల మధ్య బలమైన సంబంధాలను కలిగి ఉంది.

సమకాలీన ప్రపంచ సవాళ్లు సైన్స్-టెక్నాలజీ-ఇన్నోవేషన్ ఎజెండాను సామాజిక అవసరాలు , వినియోగదారు ఆధారిత విధానం ద్వారా రూపొందించాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.

నెదర్లాండ్స్ లోని లైడెన్ విశ్వవిద్యాలయంలో గ్లోబల్ సైన్స్ సెంటర్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ స్ట్రాటజీస్ (సిడబ్ల్యుటిఎస్) లో యునెస్కో చైర్ డైవర్సిటీ అండ్ ఇంక్లూజన్ డాక్టర్ ఇస్మాయిల్ రఫోల్స్ కీలకోపన్యాసం చేశారు.మొత్తం మానవాళి ప్రయోజనం కోసం పరిశోధన ఎజెండా కోసం వైవిధ్యమైన, సమ్మిళిత విషయాల యునెస్కో సిఫార్సును డాక్టర్ రాఫోల్స్ పునరుద్ఘాటించారు. పరిశోధన ఎజెండా విశ్వవ్యాప్తం కానప్పటికీ ఉన్నత వర్గాలకు, సంపన్నులకు అనుకూలంగా ఉంటుందనే సాధారణ భావనను ఆయన ముందుకు తెచ్చారు. మార్కెట్ డిమాండ్లు. కొన్ని సంకుచిత విద్యా లక్ష్యాలు , సామాజిక సమూహాల ద్వారా ప్రభావితమైన గ్లోబల్ నార్త్‌లో పరిశోధన ఏకాగ్రతను వివరించడం ద్వారా ఆయన తన వాదనను ఓపరిశోధన అజెండాలు ఉన్నత , మధ్య ఆదాయ దేశాలలో ఎస్డిజి లక్ష్యాలతో అనుసంధానం కాలేదని డాక్టర్ రఫోల్స్ అన్నారు. చాలా తక్కువగా అభివృద్ధి చెందుతున్న దేశాల ఎస్ డిజిలతో పరిశోధన మెరుగైన అమరికను సూచిస్తున్నాయి. విజ్ఞాన శాస్త్రానికి మరింత బహిరంగ ప్రాప్యత ,మరింత బహిరంగ మౌలిక సదుపాయాలను కలిగి ఉండాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు, తద్వారా మానవాళి గరిష్ట ప్రయోజనాన్ని సాధించవచ్చు. అమరిక లోపాలను తగ్గించడానికి సైన్స్ లలో పౌరులను చేర్చాల్సిన అవసరాన్ని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు.

న్యూఢిల్లీలోని జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో సెంటర్ ఫర్ స్టడీస్ ఇన్ సైన్స్ పాలసీ అసోసియేట్ ప్రొఫెసర్, పొదుపు అధ్యయనాలపై ట్రాన్స్-డిసిప్లినరీ రీసెర్చ్ సెంటర్ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ శారదిందు భాదురి పరిశోధన అజెండా, ఆవిష్కరణ, నియంత్రణ ,వినియోగదారు ఆధారిత పరిశోధన ఒకదానితో ఒకటి ఎలా విభేదిస్తాయనే అంశం పై ప్రజంటేషన్ ఇచ్చారు. విధాన రూపకర్తలు, వాటాదారుల మధ్య కొన్ని ఆసక్తికరమైన ఒప్పందాలను ఆయన తెలియచేశారు. స్టాండర్డ్ సర్టిఫికేషన్ ఇవ్వని ఏజెన్సీల వల్ల స్టవ్ వంటి ఉపయోగకరమైన ,విస్తృతంగా ఉపయోగించే ఉపకరణాల కు ఎదురవుతున్న సమస్యలను ఆయన ప్రస్తావించారు.

డాక్టర్ వివేక్ కుమార్ సింగ్, ప్రొఫెసర్, హెడ్, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం (బి హెచ్ యు), వారణాసి -ఓపెన్ యాక్సెస్ గోల్డ్, ప్లాటినం ,డైమండ్ ఓపెన్ యాక్సెస్ వంటి దాని వివిధ రూపాలపై ప్రసంగించారు. ఇండియాఆర్కైవ్, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ప్రచురణలు, ఐసిఎఆర్ కృషికోష్ మొదలైన ఓపెన్ ఆర్కైవ్లను ఆయన హైలైట్ చేశారు. భారతదేశంలో విజ్ఞాన లభ్యత లో అంతరం ఉన్నందున పరిశోధనను సమాజానికి అందుబాటులో ఉంచాల్సిన అవసరాన్ని డాక్టర్ సింగ్ వివరించారు. దీనిని పరిష్కరించడానికి సమర్థవంతమైన విధాన అమలును మనం కోరాలని అన్నారు.డాక్టర్ కవితా షా, ప్రొఫెసర్, పర్డ్యూ యూనివర్శిటీ, భారతదేశంలో ప్రస్తుతం మారుతున్న వాతావరణం గురించి క్లుప్తంగా వివరించారు.ఇప్పుడు భారతదేశంలో మౌలిక సదుపాయాలు, పరిశోధనకు మద్దతు , అనేక సంస్థలు ఉన్నాయని, ఇది ఉన్నత స్థాయి పరిశోధన చేయడానికి సానుకూల మార్పునుతెస్తోందని అన్నారు. సమాజం ఎదుర్కొంటున్న సవాళ్లకు అనుగుణంగా విద్యార్థులు ,పరిశోధకులు తమ పరిశోధనలను మరింత అనుసంధానం చేయడానికి ఈ అవకాశం అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు.

# ఎమ్మెల్యే రసమయి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో భారీ చేరికలు



వరంగల్, డిసెంబర్ 12:మానకొండూర్ నియోజకవర్గంలో బీఎస్పీ పార్టీకి బీఆర్ఎస్ పార్టీకి గట్టి ఝలక్ ఇచ్చింది. రాష్ట్ర సాంస్కృతిక సారథి ఛైర్మెన్, మానకొండూర్ శాసనసభ్యులు డా.రసమయి బాలకిషన్ సమక్షంలో ఈరోజు ఉదయం క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీలో భారీ చేరికలు జరిగాయి. బీఎస్పీ పార్టీ మానకొండూర్ నియోజకవర్గ అసెంబ్లి ఇన్‌చార్జి సంగుపట్ల మల్లేశంతో పాటు సుమారు 100 మంది ముఖ్య బాధ్యులు, కన్వీనర్లు గులాబీ గూటికి చేరగా ఎమ్మెల్యే రసమయి వారికి కండువాలు కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. దీంతో మానకొండూర్ నియోజకవర్గంలో బీఎస్పీ పార్టీకి గట్టి దెబ్బే తగిలింది. ఈ సందర్భంగా సంగుపట్ల మల్లేశం మాట్లాడుతూ.. తన ప్రాణాలను పణంగా పెట్టి తెలంగాణా రాష్ట్రాన్ని సాధించిన ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని స్పష్టం చేశారు. గడిచిన 8 ఏళ్ల కాలంలో ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి రాష్ట్ర ప్రజల గుండెల్లో సుస్థిర స్థానాన్ని పొందిన ఘనత కేవలం కేసీఆర్ కే దక్కింద న్నారు. కేసీఆర్ స్థాపించిన బీఆర్ఎస్ ద్వారానే దేశం ఎంతో పురోగతి సాధిస్తుందనే విశ్వాసంతో పాటు మానకొండూర్ శాసనసభ్యులు డా.రసమయి బాలకిషన్ నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధికి ఆకర్షితులమై బీఆర్ఎస్ పార్టీలో చేరడం జరిగిందని మల్లేశం వివరించారు.

# భారతదేశం అధ్యక్షతన మంగళవారం జరగనున్న జీ 20 మొదటి ఆర్థిక, సెంట్రల్ బ్యాంక్ డిప్యూటీల సమావేశం

న్యూఢిల్లీ, డిసెంబర్ 12భారతదేశం అధ్యక్షతన జీ 20 మొదటి ఆర్థిక, సెంట్రల్ బ్యాంక్ డిప్యూటీల సమావేశం బెంగళూరులో 2022 డిసెంబర్ 13,14,15 తేదీల్లో జరగనున్నది. ఆర్థిక మంత్రిత్వ శాఖ, భారత రిజర్వు బ్యాంకు సంయుక్తంగా నిర్వహిస్తున్న సమావేశంలో భారతదేశం అధ్యక్షత వహిస్తున్న జీ 20 దేశాలకు ముఖ్యమైన ఆర్థిక అంశాలు అమలు జరుగుతున్న తీరును సమీక్షించడానికి అనుసరించాల్సిన చర్యలను చర్చిస్తారు.

జీ 20 దేశాల ఆర్థిక మంత్రులు, సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ల అధ్యక్షతన జీ20 దేశాల ఫైనాన్స్ ట్రాక్ పనిచేస్తుంది. ఆర్థిక అంశలపై ప్రధానంగా దృష్టి సారించి జీ20 ఫైనాన్స్ ట్రాక్ పనిచేస్తుంది. ప్రపంచ స్థాయి ఆర్థిక అంశాలపై చర్చలు జరిపేందుకు, విధాన నిర్ణయాల సమన్వయానికి జీ20 ఫైనాన్స్ ట్రాక్ ఒకే వేదికగా ఉంటుంది. ఆర్థిక మంత్రులు, సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ల సమావేశం 2023 ఫిబ్రవరి 23,24,25 తేదీల్లో బెంగళూరులో జరుగుతుంది.

బెంగళూరులో 2022 డిసెంబర్ 13,14,15 తేదీల్లో ఆర్థిక వ్యవహారాల శాఖ కార్యదర్శి శ్రీ అజయ్ సేథ్, ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్ డాక్టర్ మైఖేల్ డి.పాత్ర సహ అధ్యక్షతన జీ 20 ఆర్థిక, సెంట్రల్ బ్యాంక్ డిప్యూటీల సమావేశం జరుగుతుంది. రెండు రోజుల పాటు సమావేశంలో జీ20 సభ్య దేశాల ఆర్థిక వ్యవహారాల అధికారులు, సెంట్రల్ బ్యాంకుల ప్రతినిధులు, భారతదేశం నుంచి ఆహ్వానం అందిన అంతర్జాతీయ సంస్థ ప్రతినిధులు పాల్గొంటారు.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తో సంబంధం ఉన్న ప్రధాన అంశాలు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ స్వరూపం, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితి, మౌలిక సదుపాయాల అభివృద్ధి,నిధుల సమీకరణ, సుస్థిర ఆర్థిక విధానాలు, ప్రపంచ స్థాయి ఆరోగ్య రంగం, అంతర్జాతీయ పన్నుల విధానంతో పాటు ఆర్థిక రంగానికి సంబంధించి వివిధ అంశాలు సమావేశంలో చర్చకు వస్తాయి.

భారతదేశం అధ్యక్షతన జీ20 ఫైనాన్స్ ట్రాక్ అమలు చేయాల్సిన అంశాలపై బెంగళూరు సమావేశం దృష్టి సారిస్తుంది. 21వ శతాబ్దంలో ప్రపంచ వ్యాప్తంగా ఎదురవుతున్న ఆర్థిక సవాళ్లకు అనుగుణంగా అంతర్జాతీయ ఆర్థిక సంస్థల ప్రాధాన్యత అంశాలను నిర్ణయించడం, భవిష్యత్తు ఆర్థిక నగరాలు, ప్రపంచ రుణ భారం నిర్వహణ, ఆర్థిక చేరిక మరియు ఉత్పాదకత ప్రయోజనాల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, సుస్థిర లక్ష్యాల సాధనకు నిధుల సమీకరణ, క్రిప్టో ఆస్తులు, అంతర్జాతీయ పన్ను విధానంలో మార్పులు తీసుకు రావడం లాంటి అంశాలు సమావేశంలో చర్చకు వస్తాయి.

సమావేశంలో భాగంగా ' 21 వ శతాబ్దంలో ఉమ్మడిగా ఎదురయ్యే సవాళ్ళను ఎదుర్కోవడానికి బహుముఖ బ్యాంకులను పటిష్టం చేయడం' అనే అంశంపై నిపుణుల చర్చలు జరుగుతాయి. ' గ్రీన్ ఫైనాన్సింగ్ లో సెంట్రల్ బ్యాంకుల పాత్ర' అనే అంశంపై సదస్సు జరుగుతుంది.

భారతదేశం ప్రతిపాదించిన 'ఒక విశ్వం, ఒక కుటుంబం,ఒక భవిష్యత్తు' విధానం జీ20 ఫైనాన్స్ ట్రాక్ సమావేశంలో చర్చకు వస్తుంది. దేశం వివిధ ప్రాంతాల్లో ఫైనాన్స్ ట్రాక్ సమావేశాలు జరుగుతాయి. దీనిలో భాగంగా జీ20 దేశాల ఆర్థిక మంత్రులు, సెంట్రల్ బ్యాంకుల గవర్నర్ల సమావేశం నిర్వహిస్తారు. జీ20 ఫైనాన్స్ ట్రాక్ సమావేశంలో చర్చకు వచ్చే అంశాలు జీ20 అగ్రనాయకుల సంయుక్త ప్రకటనలో చేర్చడం జరుగుతుంది.

వివిధ సమస్యలు ఎదురవుతున్న నేపథ్యంలో జీ20 అధ్యక్ష బాధ్యతలను భారతదేశం చేపట్టింది. కోవిడ్-19 మహమ్మారి రూపంలో ఎదురైన సవాళు , ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న రాజకీయ సంక్షోభ పరిస్థితులు, ఆహారం, ఇంధన రంగంలో ఎదురవుతున్న సమస్యలు, పెరుగుతున్న రుణభారం, ద్రవ్యోల్బణం పరిస్థితి, నిధుల కొరత లాంటి సమస్యలు ఎదురవుతున్న సమయంలో జీ20 అధ్యక్ష బాధ్యతలను భారతదేశం స్వీకరించింది. అన్ని సమస్యలు, సవాళ్ల పరిష్కారానికి అనుసరించాల్సిన చర్యలు, అమలు చేయాల్సిన వ్యూహాలకు జీ20 రూపకల్పన చేసి సభ్య దేశాలకు మార్గదర్శకంగా పనిచేస్తుంది.

సహకారం అవసరమైన దేశాలకు పూర్తి సహాయ సహకారాలు అందించి, అభివృద్ధి చెందుతున్న దేశాలు ప్రత్యేకంగా ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించాలని భారతదేశం నిర్ణయించింది. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని జీ20 ఫైనాన్స్ ట్రాక్ సమావేశాలు నిర్వహించి భవిష్యత్తు ఆర్థిక అవసరాలు తీర్చడానికి ఉజ్వల భవిష్యత్తు నిర్మాణానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తుంది.

# దళితబంధు పథకం ద్వారా మంజూరైన డెయిరీ యూనిట్లను వేగవంతం చేయాలి



ఖమ్మం, డిసెంబర్ 12 (నేటినిజం ప్రతినిధి): దళితబంధు పథకం ద్వారా మంజూరయిన డెయిరీ యూనిట్ల గ్రౌండింగ్ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. సోమవారం అధికారులతో డెయిరీ యూనిట్ల గ్రౌండింగ్ పై కలెక్టర్ సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దళితబంధు పథకం క్రింద 573 డెయిరీ యూనిట్లను మంజూరు చేసినట్లు, ఇందులో 100 యూనిట్ల గ్రౌండింగ్ పూర్తయినట్లు తెలిపారు. పశువుల్లో లంపి స్కిన్ వ్యాధి కారణంగా పశువుల రవాణాపై నిషేధం విధించడంతో డెయిరీ యూనిట్ల గ్రౌండింగ్ ఆలస్యమయినట్లు ఆయన అన్నారు. ప్రస్తుతం నిషేధం తొలగించడంతో యూనిట్ల గ్రౌండింగ్ కు చర్యలు ముమ్మరం చేయాలన్నారు. 126 మంది లబ్ధిదారులు పశు వైద్యులతో ఇప్పటికే హర్యానా, గుజరాత్ లలో గేదెల సేకరణకు వెళ్లినట్లు, సేకరణ అనంతరం తిరుగు ప్రయాణంలో ఉన్నట్లు ఆయన తెలిపారు. ఇంకనూ 132 మంది లబ్ధిదారుల అంగీకారం ఉన్నట్లు, వీరిని సేకరణకై, పశు వైద్యుల తో వెంటనే పంపేలా చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. 3 పశు వైద్యులను హర్యానా, ఇద్దరిని గుజరాత్ కు లబ్ధిదారులతో పంపినట్లు, మరో ఇద్దరు పశు వైద్యులను పంపుతున్నట్లు ఆయన తెలిపారు. పశువుల ఎంపికలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అన్నారు. సేకరించిన గేదెలు పాల ఉత్పత్తి విషయమై పశు వైద్యులు నివేదిక ఇవ్వాలన్నారు. యూనిట్ల సేకరణ అనంతరం గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేసి, లబ్ధిదారులకు నిర్వహణపై అవగాహన తో పాటు, పాలు పితకటంపై శిక్షణ, సంరక్షణ కై చర్యలు చేపట్టాలన్నారు. ప్రత్యేక అధికారులు సేకరణకు వెళ్లిన లబ్ధిదారులతో సేకరణ సమస్యల గురించి అడిగి తెలుసుకోవాలని, వారితో టచ్ లో ఉండాలని అన్నారు. ఈ సమీక్ష లో అదనపు కలెక్టర్ ఎన్. మధుసూదన్, ఖమ్మం ఆర్డీవో రవీంద్రనాథ్, ఎస్సి కార్పొరేషన్ ఈడి శ్రీనివాస రావు, జెడ్పి సిఇఓ అప్పారావు, పశుసంవర్ధక శాఖ ఎడి డా. భాను, ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించాలి



మెదక్, డిసెంబర్ 12 నేటినిజం (ప్రతినిధి): ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరించవలసినదిగా ఆర్.డి.ఓ. సాయి రామ్ అధికారులకు సూచించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి డి.ఎస్.ఓ. శ్రీనివాస్ తో కలిసి ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి వివిధ సమస్యల పరిష్కార నిమిత్తం వచ్చిన ఫిర్యాదీ దారుల సమస్యలను సావధానంగా విని పరిష్కారమార్గాలు చూపారు. మరాకొన్ని దరఖాస్తులను సంబంధిత శాఖాధికారులకు అందజేస్తూ పరిశీలించి తగు చర్య తీసుకోవలసిందిగా సూచించారు.

ప్రజావాణిలో 33 విజ్ఞప్తులు రాగా అందులు 23 దరఖాస్తులు భూ సమస్యలకు సంబంధించినవి కాగా, పోడు భూములకు సంబంధించి 3, పింఛన్లు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, వైద్య ఆరోగ్య శాఖ, తదితర వాటికి సంబంధించి 6 , మహిళా శిశు సంక్షేమానికి సంబంధించి ఒక వినతి వచ్చాయి. అందులో కొన్ని వినతులు ఇలా... అటవీ హక్కుల చట్టం క్రింద హక్కులు కల్పించిన పట్టా పాస్ బుక్ రాలేదని, ఇప్పించవలయునదిగా కౌడిపల్లి మండలం దేవులపల్లి క్యాదం చంద్రకళ విజ్ఞప్తి చేశారు. రోడ్డు మాస్టర్ ప్లాన్ నో షాపు కోల్పోయిన తనకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇస్తామని ఇంతవరకు ఇవ్వలేదని ఇప్పించవలసిందిగా వెల్దుర్తి గ్రామ వాసి నోముల రమేష్ విజ్ఞప్తి చేయగా పరిశీలించవలసినదిగా తహశీల్దార్ కు సూచించారు. సర్వే నెంబరు 204 లో సాగుచేస్తున్న 2 గుంటల అటవీ భూమి కబ్జాకు గురైనదని, ఇప్పించవలసిందిగా చిలిపిచేడ్ మండలం గౌతాపూర్ గన్యా తాండ వాసి గుగులోత్ దోలి విజ్ఞప్తి చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరు చేయవలసినదిగా హవేళిఘనాపూర్ మండలం శుక్లార్ పెట్ తండా వాసి బర్మ వాత్ సునీత కోరారు. అక్రమంగా గరుగుల కుంట ను ఆక్రమించుకున్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నుండి విముక్తి చేసి తమ పంట పొలాలకు నీరందే విధంగా చూడవలసినదిగా కొల్చారం మండలం కొంగోడ్ వాసి విజ్ఞప్తి చేశారు.

కరోనా సమయంలో చనిపోయిన మా అమ్మ కు సంబంధించి అందజేయవలసినదిగా చేగుంట మండలం బోనాల్ కొండాపూర్ వాసి రాజశేఖర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు విజయ శేఖర్ రెడ్డి, సత్యనారాయణ, శ్రీనివాస్ రావు, రజాక్, సారా శ్రీనివాస్ వేణు గోపాల్ రావు, కలెక్టరేట్ ఏ.ఓ. యూనుస్ తదితరులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి పరికపల్లి ఆసరా



ఖమ్మం, డిసెంబర్ 12 (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం జిల్లా కొనిజర్ల మండలం స్థానిక గ్రామానికి చెందిన జంగం రాములు మృతిపట్ల పరికపల్లి శ్రీనివాస్ సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు పెద్ద మునగాల గ్రామ సర్పంచ్ పరికపల్లి శ్రీనివాస్, ఆయా కుటుంబానికి 5 వేల రూపాయల నగదును సోమవారం ఆయా కుటుంబానికి అందజేశారు. వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. తక్షణం స్పందించి తక్షణ ఆర్థిక సహకారం అందించిన కొనిజర్ల మండల బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి పరికపల్లి శ్రీనివాస్ కు పలువురు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పెద్ద మునగాల గ్రామశాఖ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తలారి ప్రేమ్ చంద్, మండల నాయకులు కొనకంచి మోషె, బీసీ సెల్ అధ్యక్షుడు రచ్చ రామకోటయ్య, కాంతారావు, సైదులు, బాలయ్య, శ్రీను, కృష్ణ, కిరణ్, తదితరులు ఉన్నారు.

# చట్టసభల్లో 15 శాతం మహిళా సభ్యుల సంఖ్య

న్యూ డిల్లీ డిసెంబర్ 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ఆకాశంలో సగం.. అన్నింటిలో సగమంటూ మహిళా సాధికారిత గురించి సందర్భం వచ్చిన ప్రతిసారి అన్ని పార్టీల రాజకీయ నాయకులు ఊకదంపుడు ప్రసంగాలిస్తుంటారు. అయితే ఆచరణకొచ్చేసరికి మాత్రం వీరి మాటలు నీటి మూటలేనని స్పష్టమవుతోంది. ఆయా రాష్ట్రాల అసెంబ్లీల్లో మహిళలు ఎంత మంది సభ్యులుగా ఉన్నారో వివరిస్తూ కేంద్ర ప్రభుత్వం వెల్లడించిన గణాంకాలు దిమ్మతిరిగే వాస్తవాలను వెల్లడిస్తున్నాయి.కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం... పార్లమెంట్ రాష్ట్రాల శాసనసభల్లో మహిళా సభ్యుల సంఖ్య 15 శాతం లోపే ఉండటం అందరినీ విస్మయ పరుస్తోంది.ఇక తెలుగు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్ తెలంగాణ శాసనసభల విషయానికొస్తే మహిళా ఎమ్మెల్యేల సంఖ్య మొత్తం స్థానాల్లో 10 శాతం లోపే ఉండటం గమనార్హం. తెలంగాణ ఆంధ్రప్రదేశ్తోపాటు అసోం గోవా గుజరాత్ హిమాచల్ ప్రదేశ్ కేరళ కర్ణాటక మధ్యప్రదేశ్ మహారాష్ట్ర మణిపూర్ ఒడిశా సిక్కిం తమిళనాడు సహా 19 రాష్ట్రాల అసెంబ్లీల్లో మహిళా ఎమ్మెల్యేల వాటా పది శాతం లోపే ఉంది.ఇక ఛత్తీస్గఢ్ (14.44) ఝార్ఖండ్(12.35) పశ్చిమ బెంగాల్ (13.70) పంజాబ్(11.11) రాజస్థాన్(12) ఉత్తరాఖండ్(11.43) ఉత్తరప్రదేశ్(11.66) బిహార్(10.70) శాసనసభల్లో మాత్రం మహిళా సభ్యుల సంఖ్య పది శాతం కంటే అధికంగా ఉండటం విశేషం.అసెంబ్లీల్లో మహిళా ఎమ్మెల్యేల జాతీయ సగటు ఎనిమిది శాతం మాత్రమే ఉండటం గమనార్హం.ఇక పార్లమెంటులో లోక్సభ రాజ్యసభల విషయానికొస్తే మహిళా సభ్యులు సంఖ్య వరుసగా 14.94 శాతం 14.05 శాతం మాత్రమే ఉంది.చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెంచేందుకు కేంద్రం తీసుకుంటున్న చర్యలేంటని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ బెనర్జీ లోక్సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తాజాగా ఈ గణాంకాలను వివరించారు.కాగా ఇటీవల జరిగిన గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో 8.2 శాతం మంది మహిళలు శాసనసభకు ఎన్నిక కాగా హిమాచల్ ప్రదేశ్ లో మాత్రం ఒకే ఒక్క మహిళ ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

# వైసీపీ విముక్తి ఆంధ్రప్రదేశ్ కోసం అంతా కలిసికట్టుగా ముందుకు..

**- పొత్తులపై నాదెండ్ల మనోహర్ ఆసక్తికర వ్యాఖ్యలు**

అమరావతి డిసెంబర్ 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఆంధ్రప్రదేశ్ లో వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావాలని జనసేన పార్టీ భావిస్తోంది. ఇప్పటికే వచ్చే ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ లో అధికారంలోకి వచ్చేది తమ పార్టీయేనని జనసేనాని పవన్ కల్యాణ్ చెబుతున్నారు.మరోవైపు జనసేన తమతో కలసి వస్తే బాగుంటుందని టీడీపీ ఆశిస్తోంది. తమ రెండు పార్టీలు కలసి పోటీ చేస్తే వైసీపీని చిత్తుగా ఓడించొచ్చని టీడీపీ భావిస్తోంది. ఇంకోవైపు బీజేపీ తాము జనసేనతోనే కలసి పోటీ చేస్తామని అంటోంది. వైసీపీ టీడీపీ కుటుంబ పార్టీలు అవినీతి పార్టీలు అని చెబుతోంది. ఈ నేపథ్యంలో జనసేన ? బీజేపీ కూటమి అధికారంలోకి వస్తుందని బీజేపీ నేతలు చెబుతున్నారు.జనసేన ? టీడీపీ కలసి పోటీ చేస్తే తమ పార్టీ ఓడిపోవడం ఖాయమని భావిస్తున్న వైసీపీ నేతలు జనసేనపై నిప్పులు చెరుగుతున్నారు. దమ్ముంటే 175 సీట్లలో పోటీ చేయాలని సవాల్ విసురుతున్నారు. 175 సీట్లలో పోటీ చేస్తే పవన్ ను తాము ప్యాకేజీ స్టార్ అనబోమని అంటున్నారు. పవన్ ఒంటరిగా పోటీ చేస్తే ఓట్లు చీలిపోయి మళ్లీ వైసీపీ అధికారంలోకి వస్తుందని వైసీపీ నేతలు గట్టి నమ్మకంతో ఉన్నారు. అందుకే పదే పదే పవన్ ను టార్గెట్ చేస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఈ నేపథ్యంలో జనసేన పార్టీ ముఖ్య నేత నాదెండ్ల మనోహర్ పొత్తులపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. శ్రీకాకుళంలో ఒక పార్టీ కార్యక్రమంలో పాల్గొన్న నాదెండ్ల పొత్తులపై త్వరలోనే ప్రకటన చేస్తామని తెలిపారు.మార్చి 14న ఇప్పటం గ్రామంలో జరిగిన సభలో పవన్ కల్యాణ్ వైసీపీ విముక్త ఆంధ్రప్రదేశ్ కోసం అంతా కలిసికట్టుగా ముందుకు రావాలని సూచించారని నాదెండ్ల మనోహర్ గుర్తు చేశారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా బాధ్యత తీసుకోవాలని అందుకు తమ సహకారమందిస్తామని తమ అధినేత చెప్పారని వెల్లడించారు. పవన్ మాట ప్రకారం.. రాబోయే రోజుల్లో పార్టీ కార్యక్రమాలు పూర్తి చేసుకుంటామని తెలిపారు. ఆ తర్వాత ఎన్నికలకు ఎలా సిద్ధం కాబోతున్నామో అందరికీ పారదర్శకంగా తెలియజేస్తామని తెలిపారు.యువతకు ఉద్యోగావకాశాల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని జాబ్ క్యాలెండర్ పేరుతో మభ్యపెట్టిందనిన నాదెండ్ల మనోహర్ తీవ్ర విమర్శలు చేశారు. వైసీపీ వ్యవహారాల కోసం కొత్తగా ఐదు లక్షల మంది గృహసారథులను నియమిస్తామంటున్నారని.. అది ప్రజాస్వామ్యబద్ధం కాదని తెలిపారు.మరోవైపు తెలంగాణలో జరగబోయే సాధారణ ఎన్నికల్లో పోటీ చేసేందుకు జనసేన పార్టీ సమాయత్తమవుతోంది. అభ్యర్థుల ఎంపికకు సంబంధించిన కసరత్తును ఇప్పటికే ఆ పార్టీ ప్రారంభించింది.




# తెలంగాణలో పోటీకి జనసేన అవసరమైన అన్ని ఏర్పాట్లు

హైదరాబాద్, డిసెంబర్ 12:తెలంగాణలో పోటీచేయడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను జనసేన చేస్తోంది. తెలంగాణలో కూడా పోటీచేసేందుకు కేడర్ సిద్ధంగా ఉండాలంటూ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఇటీవల పిలుపునిచ్చారు.పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు 32 నియోజకవర్గాల్లో కార్యనిర్వాహకులను ఎంపిక చేసినట్లు తెలంగాణ జనసేన ఇన్ చార్జి శంకర్ గౌడ్ వెల్లడించారు. వీరికి కేటాయించిన నియోజకవర్గాల్లో పర్యటించి అధినేతకు నివేదిక అందజేస్తారని.. ఆ నివేదిక ఆధారంగా అభ్యర్థులను ప్రకటిస్తామన్నారు.ఏపీలో పూర్తిస్థాయిలో పోటీకి సిద్ధమవుతున్న జనసేన తెలంగాణలో కూడా పోటీకి సిద్ధమైంది. మరోవైపు కేసీఆర్.. బీఆర్ఎస్ పేరుతో ఏపీలో అడుగుపెట్టబోతున్నారు. తెలంగాణలో జనసేన ఎవరి ఓటు చీలుస్తుంది? ఏపీలో బీఆర్ఎస్ ఎవరి ఓటు చీలుస్తుంది? అనే విషయంలో విశ్లేషకులు సందిగ్ధతను వ్యక్తం చేస్తున్నారు.కొద్దిరోజులు తమ పార్టీ కార్యకలాపాలను మరింత ఉధృతం చేసి రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తే కానీ ఇక్కడి పరిస్థితి ఏమిటనే దానిపై ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉంది.ఏపీలో జనవాణి కార్యక్రమంలో పార్టీ ఇమేజ్ ను పెంచిన పవన్ తెలంగాణలో పోటీ చేస్తున్నట్లు గతంలో స్పష్టం చేశారు. ఎన్ని స్థానాల్లో పోటీ చేయాలనేది తర్వాత వెల్లడిస్తామన్నారు. కొండగట్టు నుంచి తెలంగాణ రాజకీయం మొదలుపెట్టబోతున్నట్లు చెప్పారు.ఇటీవల ఒక కార్యక్రమంలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ 1947లో కర్నూలులో మనం జెండా ఎగురవేశామని.. 1948లో తెలంగాణకు స్వాతంత్ర్యం వచ్చిందని.. రజాకార్ల దాష్టీకంతో ప్రజలు నలిగిపోయారన్నారు. శ్రీకాంతాచారితో సహా వెయ్యిమంది బలిదానంతో తెలంగాణ ఏర్పడిందన్నారు.

# కేవలం 8 నిమిషాల్లో నాలుగు పెట్రోల్ పంపులు లూటీ..!

న్యూఢిల్లీ, డిసెంబర్ 12 ఒకప్పుడు దొంగతనాలు జరిగితే నిందితులను పట్టుకోవడం చాలా కష్టంగా ఉండేది. కానీ ఇప్పుడు టెక్నాలజీ పెరగడంతో చాలావరకు కేసుల చేధన సులభతరం అవుతున్నది. సీసీ కెమెరాలు, సెల్ ఫోన్ లొకేషన్‌లతో దొంగలను ఈజీగా పట్టేస్తున్నారు. అయినా దొంగలు మాత్రం దోపిడీలు చేయడంలో ఏమాత్రం వెనక్కి తగ్గడంలేదు.గత అర్ధరాత్రి హర్యానాలోని రేవారి పట్టణంలో దోపిడీ దొంగలు చెలరేగి పోయారు. కేవలం 8 నిమిషాల వ్యవధిలో ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా రేవారీలోని నాలుగు పెట్రోల్ పంపులను నలుగురు సభ్యులతో కూడిన దొంగల ముఠా లూటీ చేసింది. నాలుగు పెట్రోల్ పంపుల్లో కలిపి రూ. 1.05 లక్షలను ఎత్తుకెళ్లారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు.

# శబరిమలకు పోటెత్తిన భక్తులు

హైదరాబాద్, డిసెంబర్ 12: కేరళలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శబరిమల భక్తుల తాకిడితో కిటకిటలాడుతోంది. కొండ మొత్తం అయ్యప్ప నామస్మరణతో మార్మోగి పోతోంది. స్వామి దర్శనానికి గతంలో ఎన్నడూలేని విధంగా భక్తులు తరలివస్తున్నారు. భక్తులు అత్యధిక సంఖ్యలో శబరిమలకు తరలి రావడంతో ఆలయ ప్రాంగణంలో రద్దీ నెలకొంది. అయ్యప్ప దర్శనానికి సుమారు 10 నుంచి 12 గంటల సమయం పడుతోంది. దిగువన పంబ నుంచి సన్నిధానం వరకూ ఆరు కిలోమీటర్ల మేర క్యూలైన్ భక్తులతో నిండిపోయింది.

కాగా, గత కొద్ది రోజుల నుంచి రోజుకు లక్ష మంది అయ్యప్పను దర్శించుకుంటున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. సోమవారం 1,07,260 మంది స్వామి దర్శనం కోసం టికెట్లు బుక్ చేసుకున్నట్లు వెల్లడించారు. శనివారం లక్ష, ఆదివారం 1.10 లక్షల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నట్లు వివరించారు.మరోవైపు భక్తుల రద్దీ నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు. రద్దీ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అన్నదానం, మంచినీటి సౌకర్యాలు కల్పిస్తున్నారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

# ఏపీలో 1.9 లక్షల మంది వీధి వర్తకులకు స్వనిధి రుణాలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 12 'ప్రధానమంత్రి స్వనిధి' పథకం కింద ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటి వరకు 1,90,433 మంది వీధి వర్తకులకు రుణాలు మంజూరు చేసినట్లు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి తెలిపారు. రాజ్యసభలో వైఎస్సార్సీపీ ఎంపీ విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి బదులిస్తూ 2020-21 ఆర్థిక సంవత్సరంలో 1,12,744 మందికి, 2021-22 లో 70,415 మందికి, 2022-23 లో 7,274 మందికి మొదటి దశ కింద ఒక్కొక్కరికి రూ. 10 వేల రుణం మంజూరు చేసినట్లు తెలిపారు. మొదట తీసుకున్న రుణం సక్రమంగా చెల్లించిన వారికి రెండవ దఫా రుణం కింద రూ. 20 వేల రుణం మంజూరు చేసినట్లు చెప్పారు.

మూడవ దశ కింద 251 మందికి రూ. 50 వేల రుణం అందించినట్లు మంత్రి తెలిపారు. అలాగే వడ్డీ సబ్సిడీ కింద రూ. 3 కోట్లు, క్యాష్ బ్యాక్ కింద రూ. 1.65 కోట్లు లబ్దిదారులకు అందజేసినట్లు తెలిపారు. ఈ ఏడాది డిసెంబర్ 4 నాటికి పీఎం స్వనిధి పథకం కింద రుణాల కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి 4 లక్షల దరఖాస్తులు అందగా అందులో 67,404 దరఖాస్తులు అర్హత లేనివిగా గుర్తించి తిరస్కరించినట్లు తెలిపారు. 16,118 దరఖాస్తులు మంజూరు దశలో ఉన్నాయని, 29,853 మంది బ్యాంకులకు అందుబాటులో లేని కారణంగా రుణాల పంపిణీ పెండింగ్‌లో ఉన్నట్లు మంత్రి వివరించారు.

కోవిడ్ మహమ్మారి కారణంగా కుదేలైన వీధి వర్తకులు తిరిగి వారి వ్యాపార కార్యకలాపాలను కొనగించుకునేందుకు వర్కింగ్ కాపిటల్ కింద రూ. 10 వేల రుణం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం స్వానిధి పథకాన్ని 2020 జూన్ 1న ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. తీసుకున్న రుణం సకాలంలో చెల్లించిన వారికి రెండవ దఫా రుణం కింద రూ. 20 వేలు, మూడవ దఫా కింద రూ. 50 వేల రూపాయలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. సకాలంలో రుణం చెల్లించిన వారికి తీసుకున్న రుణంపై 7% వడ్డీ రాయితీ, డిజిటల్ చెల్లింపులు చేసిన వారికి క్యాష్ బ్యాక్ కింద ఏడాదికి రూ. 1,200 రూపాయలు చెల్లించినట్లు మంత్రి పేర్కొన్నారు.




Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail netinijam93@gmail.com.